ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

నల్లగొండ

: fb.com/vaartha Digital

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Khammam, Karimnagar, Mahabubnagar, Nellore, Tadepalligudem, Srikakulam

12-3-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 39 పేజీలు: 8+16 వెల: 6.50



అసెంబ్లీ సమావేశాలకు వస్తున్నా: మాజీ సిఎం కెసిఆర్ 2లో

పాకిస్థాన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు హైజాక్ 5లో


## కేజ్రీవాల్, మరో ఇద్దరిపై కేసు

### 18 లోగా నివేదిక ఇవ్వాలని ఢిల్లీ కోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ, మార్చి 11:** ఆప్ అధినేత మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నుంచి షాక్‌లాంటి ఉత్తర్వులు వచ్చాయి. అరవింద్‌కేజ్రీవాల్ మరో ఇద్దరిపై కేసులునమోదుచేసి దర్యాప్తుచేయాలని ఈనెల 18వ తేదీనాటికి తమకు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. 2019నాటి ఈకేసులో దిగువ కోర్టు తొలుత ఈపిటిషన్‌ను తిరస్కరించింది. మద్యంపాలసీ కుంభకోణంలో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటునన మాజీ సిఎం తన సొంత నియోజకవర్గంలో నిధులు దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ పిటిషన్ దాఖలు చేసారు. ప్రజలనుంచి పన్నులరూపంలో వసూలుచేసిన ప్రభుత్వ నిధులను ఢిల్లీవీధుల్లో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటుకు మాత్రమే వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గులాబ్‌సింగ్, నితికా శర్మలపైనా కేజ్రీవాల్‌తో పాటు కేసులు నమోదుచేసి >>2

## కాలుష్య దేశాల్లో మనం '5'

### 13 నగరాలు భారత్‌లోనే..



ఢిల్లీలో విపరీతమైన వాయు కాలుష్యం దృశ్యం

**న్యూఢిల్లీ, మార్చి 11:** ప్రపంచంలో వాయుకాలుష్యం అత్యధికంగా ఉన్న టాప్ 20 నగరాల జాబితాలో ఏకంగా 13 నగరాలు భారత దేశంనుంచే ఉన్నాయి. స్విస్ ఎయిర్‌క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూ ఎయిర్‌కాలుష్యంపై రూపొందించిన ది వరల్డ్ ఎయిర్‌క్వాలిటీ రిపోర్టు 2024 నివేదిక విడుదలచేసింది. ఇందులో ప్రపంచంలో ఐదో అత్యంత కలుషిత దేశంగా భారత్‌నిలిచింది. ఈ జాబితాలో అస్సాంలోని బైర్నిహాట్ అగ్రస్థానంలోఉంది. తర్వాత స్థానాల్లో దేశ రాజధాని ఢిల్లీ, పంజాబ్‌లోని ముల్లన్‌పూర్, ఫరీదాబాద్‌లోని >>2

## ప్రధాని మోడీకి మారిషస్ అత్యున్నత పురస్కారం

### ప్రకటించిన ప్రధాని నవీన్‌రామ్ గులాం



ప్రధాని మోడీకి అత్యున్నత పురస్కారం అందిస్తున్న మారిషస్ ప్రధాని నవీన్ రామ్

**పోర్ట్‌లూయిస్, మార్చి 11:** మారిషస్ ద్వీపకల్పదేశంలో పర్యటిస్తున్న ప్రధానిమోడీకి ఆదేశ అత్యున్నత గౌరవం లభించింది. 'గ్రాండ్ కమాండర్ ఆఫ్‌ది ఆర్డర్ ఆఫ్‌ది స్టార్ అండ్ కీ ఆఫ్‌ది ఇండియన్ ఓషన్'తో ప్రధానిమోడీని సత్కరించింది. మారిషస్ ప్రధాని నవీన్ చంద్రరామ్‌గులాం మంగళవారం ప్రధాని మోడీకి ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ప్రధానిమోడీకి ఇది 21వ అంతర్జాతీయ అవార్డు. మారిషస్ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయుడు కూడా ప్రధాని మోడీయే. రెండురోజుల పర్యటనకోసం మారిషస్ వెళ్లినప్రధాని పోర్టులూయిస్‌లో భారతీయ సంతతి కార్యక్ర >>2


# వేడి, వాడిగా నేటినుంచి అసెంబ్లీ

### అధికార, విపక్షాలు అమీతుమీకి సిద్ధం

### సభకు హాజరై విమర్శలు సంధించనున్న కెసిఆర్

### కౌంటర్‌కు సిద్ధమైన సిఎం రేవంత్, మంత్రులు

### బడ్జెట్ సమావేశాలకు భారీ భద్రత




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి11:** రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అధికార, విపక్షాలు సభలో అమీతుమీకి సిద్ధమవుతున్నాయి. ఉదయం 11 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. అనంతరం సమావేశాలు అజెండాపై బిఏసి సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ ఎన్నిరోజులు, ఏ అంశాలపై చర్చించనున్నారో ఖరారు చేయనున్నారు. బడ్జెట్ సమావేశాలు ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉందని అధికార పార్టీవర్గాలు చెబుతున్నాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం ఉభయ సభల్లో వేరు వేరుగా చర్చలు జరుగనున్నాయి. ఈనెల 17,18 తేదీల్లో బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్,ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ తీర్మానం చేస్తారు. ఈనెల 19నే బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. ఈ నెలాఖరు వరకు సభ జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా బడ్జెట్‌తోపాటుగా ఎస్సీ వర్గీకరణ, బీసీలకు రిజర్వేషన్లు, 42శాతం అమలుచేస్తూ తీర్మానమే ప్రధానంగా ఉంటుందని సమాచారం. ఈ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్ష నేత కెసిఆర్ హాజరుకానున్నారు. తాను సమావేశాలకు వస్తానని ఆయనే స్వయంగా ప్రకటించారు.

ఈ నేపథ్యంలో ప్రస్తుత సమావేశాలు ఆసక్తికరంగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా రైతులు, నిరుద్యోగుల సమస్యలు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఇలా పలు ప్రధానమైన అంశాలు చర్చకు రానున్నాయి. అసెంబ్లీ సమావేశాలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి ఆటంకాలు కలగకుండా సమావేశాలు జరిగే విధంగా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సభకు హాజరై కాంగ్రెస్‌పై విమర్శలు చేసేందుకు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సిద్ధమయ్యారని సమాచారం. ఇదే సమయంలో విపక్షాల విమర్శలకు కౌంటర్ ఇచ్చేందుకు సిఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు సన్నద్ధమయ్యారని సమాచారం.కాగా, బిజెపి పక్షంకూడా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలను సంధించేందుకు >>2

## జెఎల్, పాలిటెక్నిక్ లెక్చరర్లకు నేడు నియామక పత్రాలు

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్, సాంకేతిక విద్య శాఖలో నూతనంగా ఎంపికైన లెక్చరర్లకి నేడు (బుధవారం) నియామక పత్రాలను అందజేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతనంగా నియమితులైన లెక్చరర్లకి నేడు మధ్యాహ్నం 2 గంటలకు రవీంద్రభారతిలో నియామక ఉత్తర్వులను అందజేయనున్నారు. గడచిన కొన్ని సంవత్సరాలుగా విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా కళాశాలలలో అర్హత కలిగిన, నిబద్ధతతో కూడిన అధ్యాపకులను నియమించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

అందులో భాగంగా ఇంటర్మీడియట్ విద్యలో 1,292 మంది (పురుషులు 794, మహిళలు 498) జూనియర్ లెక్చరర్లు, పాలిటెక్నిక్ కాలేజీల్లో 240 మంది (పురుషులు 177, మహిళలు 63) అధ్యాపకులు నియామక ఉత్తర్వులను అందుకోనున్నారు. జెఎల్, పాలిటెక్నిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన లెక్చరర్లకు స్వాగతం పలుకుతున్నందుకు సంతోషంగా ఉందని విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా >>2

## లిఫ్ట్ ప్రమాదంలో కమాండెంట్ గంగారాం మృతి



మూడవ అంతస్తు నుంచి కిందకు పడడంతో తీవ్ర గాయాలు

ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

3లో

## సమ్మక్క వర్సిటీ విసిగా వైఎల్ శ్రీనివాస్

### ఉత్తర్వులిచ్చిన కేంద్ర విద్యాశాఖ



**హైదరాబాద్, మార్చి 11, ప్రభాత వార్త:** ములుగులోని సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను నియమిస్తూ కేంద్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లాకి చెందిన ప్రొఫెసర్ యడవల్లి లక్ష్మీ శ్రీనివాస్‌ను విసిగా నియమిస్తూ మంగళవారం కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఐదేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. యూనివర్సిటీలో ఈ ఏడాది ప్రవేశాలను ప్రారంభించిన నేపథ్యంలో.. ములుగు జిల్లాలో ఉన్న సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి మొదటిసారిగా కేంద్ర విద్యాశాఖ విసిని నియమించింది. హైదరాబాద్‌లోని అరోరా ప్రైవేటు యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్ విసిగా నియామకం అయ్యారు. కేంద్ర ప్రభుత్వం >>2

## జన్వాడ డ్రోన్ కేసుపై విచారణ 19కి వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి11:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై గతంలో నమోదైన జన్వాడ డ్రోన్ కేసు కొట్టివేయాలంటూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు, ఆ పార్టీ నేత కెటిఆర్‌కు చెందిన జన్వాడలోని ఫాంహౌస్‌పై అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారంటూ 2020 మార్చిలో రేవంత్‌రెడ్డిపై కేసు నమోదైంది. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఈ కేసులో అప్పట్లో రేవంత్‌రెడ్డిని >>2



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

## ట్రిబుల్ ఆర్‌కు రెండు నెలల్లో గ్రీన్ సిగ్నల్

### 2 ప్యాకేజీలుగా హైదరాబాద్-మచిలీపట్నం జాతీయ రహదారి నిర్మాణం

### కేంద్రమంత్రులు గడ్కరీ, రామ్మోహన్‌లను కలిసిన మంత్రి కోమటిరెడ్డి

**పభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి11:** తెలంగాణ రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. మంగళవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రులు ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడితో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలుకీలకఅంశాల గురించి చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రీజినల్ రింగ్ రోడ్డుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలని గడ్కరీని కోరగా దీనికి సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని, అన్ని క్లియరెన్స్‌లు వచ్చాక ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకువెళతామని గడ్కరీ హామీ ఇచ్చారని తెలిపారు. సంగారెడ్డి-భువనగిరి-చౌటుప్పల్ వరకు ఆర్ఆర్ఆర్ టెండర్ల >>2

## 5 లక్షల మంది యువతకు స్వయం ఉపాధి పథకాలు

### రూ. 3 లక్షల చొప్పున సాయం

### 15 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు

### లబ్ధిదారులకు జూన్ 2న మంజూరు పత్రాలు

### కార్యాచరణ వెల్లడించిన డి.సిఎం భట్టి



మంగళవారం చాకలి ఐలమ్మ వర్సిటీలో మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి11:** రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులకు రూ.6 వేల కోట్లతో ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి పథకాలు అందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్ వీర వనిత చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడారు. యువత వికాసం గురించి గత బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదని, ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించి వారి అభ్యున్నతికి దోహదపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని ఈ సందర్భంగా వివరించారు. ఎస్సీ ఎస్టీ బిసి >>2

## ఐదుగురూ ఏకగ్రీవమే

### 13న కొత్త ఎమ్మెల్సీలకు సర్టిఫికెట్లు అందజేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి11:** శాసనమండలి ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పరిశీలన పూర్తి అయింది. మంగళవారం నామినేషన్ల పరిశీలన రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి చేపట్టారు. ఆరుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్ ఫారాలను సరైన విధంగా దాఖలు చేయకపోవడంతో వాటిని తిరస్కరించినట్లుగా ప్రకటించారు. బరిలో ఐదుగురు అభ్యర్థులు మాత్రమే మిగిలారు. కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, సిపిఐ నుంచి నెల్లికంటి సత్యం, బిఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్‌లు ఉన్నారు. వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా గురువారం(13వ తేదీన) మధ్యాహ్నం 3 గంటల తర్వాత ప్రకటించనున్నారు. వీరు మార్చి 30వ తేదీ నుంచి ఎమ్మెల్సీలుగా కొనసాగనున్నారు.



మంగళవారం హైదరాబాద్‌లో గ్రూప్-2 ఫలితాలు విడుదల చేస్తున్న టిజిపిఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, సభ్యులు

## గ్రూప్-2 ఫలితాల్లో పురుషులదే హవా

### 447 మార్కులతో వెంకట హార్షవర్ధన్ టాపర్

### టాప్-31 వరకు పురుషులే: టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-2 పోస్టుల భర్తీ కోసం గత ఏడాది డిసెంబరు 15, 16 తేదిల్లో నిర్వహించిన పరీక్షల ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) మంగళవారం ప్రకటించింది. ఫలితాల్లో పురుషులు తమ ఆధిక్య తను ప్రదర్శించారు. మొదటి ర్యాంక్‌తోపాటు 31వ ర్యాంక్ వరకు పురుషులే కైవసం చేసుకున్నారు. 32వర్యాంక్‌ను మహిళ సొంతం చేసుకుంది. 447. 088 మార్కులతో నారు వెంకట వర్షవర్ధన్ మొదటి ర్యాంక్‌ను సాధించారు. గ్రూప్-2 ఫైనల్ కీతో జనరల్ ర్యాంకు లిస్టు (జిఆర్ఎల్)ను కమిషన్ ప్రకటిం చింది. టిజిపిఎస్‌సి కమిషన్ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సమా వేశం నిర్వహించి.. ఫలితాలపై చర్చించిన తర్వాత ఫైనల్ కీతో పాటు జనరల్ ర్యాంకింగ్ జాబితా(జిఆర్ఎల్)ను విడుదల చేసింది. అభ్యర్థుల జిఆర్ఎల్‌ను అభ్యర్థి లాగిన్‌లో కూడా ఉంచారు. >>2



రోబో టెక్నాలజీ ని టన్నెల్‌లోకి తీసుకెళ్తున్న బృందం

## ఇక టన్నెల్‌లోకి రోబోలు

### • మనుషులు వెళ్లలేని ప్రాంతానికి పంపే ఏర్పాట్లు • ఇంకా కొనసాగుతున్న రెస్క్యూ చర్యలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి మార్చి11, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో సహాయక చర్యలు మరింత వేగవంతం చేశారు. అన్వి రోబోటిక్ సంస్థ రూపొందించిన 4రోబోలను టన్నెల్ లోకి పంపించారు. మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో రోబోల సాయంతో సహాయక చర్యలు చేపట్టే ఏర్పాట్లు చేశారు. సహాయక చర్యల్లో 12 బృందాలు నిరంతరంగా శ్రమిస్తున్నాయి. మృతదేహాన్ని వెలికితీసిన బృందాలు మరింత లోతుగా రెస్క్యూ కొనసాగిస్తున్నారు. మానవులు వెళ్లలేని ప్రాంతాలు వెళ్లి అవశేషాలు గుర్తించి ముక్కలు ముక్కలుగా చేసి బయటకు తీసుకురావడం రోబోల ప్రత్యేకత. మంగళవారం ఎస్ఎల్‌బిసి టన్నెల్ సహాయక చర్యలపై డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, టన్నెల్ ఆఫీసులో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుత సహాయక చర్యల పురోగతిని సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. టన్నెల్ సహాయక చర్యలలో అనుసరించాల్సిన విధి విధానాలు, రోబోటిక్స్, మెకానికల్ పరికరాల వినియోగం, మట్టి తొలగింపు ప్రక్రియ, భద్రతా చర్యలపై విస్తృతంగా చర్చించిన అధికారులు సహాయక చర్యలను మరింత వేగవంతం చేయడానికి తీసుకోవాలని అధికారులకు అవసరమైన అన్ని చర్యలు వివరించారు. టన్నెల్ లోపల జరిగే సహాయక చర్యలలో రోబోలను ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు మంగళవారం ఉదయం హైద్రాబాద్ కు చెందిన అన్వి రోబోటిక్స్ సంస్థకు చెందిన బేస్డ్ కెమెరా సదుపాయం గల రోబోటిక్ ను సంస్థ ప్రతినిధులు విజయ్ అక్షయ్‌లు లోకో ట్రైన్ లో సొరంగంలోకి వెళ్లారు. అన్వి రోబోటిక్ సంస్థకు చెందిన ప్రతినిధులు దగ్గర ఆఫీసులో కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాట్లను ప్రారంభించినట్లు వివరిం >>2



మంగళవారం సిఎం రేవంత్ రెడ్డిని కలుసుకున్న మోహన్‌బాబు, విష్ణు

## సిఎం రేవంత్‌తో భేటీ అయిన మోహన్‌బాబు, విష్ణు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి11:** సినీనటులు మంచు మోహన్‌బాబు,మంచు విష్ణు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సిఎంను మంగళవారంనాడు కలిశారు.

## పురుషులదే హవా

>> టిజిపిఎస్‌సి కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, సభ్యులు అమీర్ ఉల్లా ఖాన్, ప్రొఫెసర్ నర్రి యాదయ్య, యరబాది రాంమోహన రావు, పాల్వాయి రజని కుమారి సమక్షంలో ఫైనల్‌కీ, జీఆర్ఎల్ విడుదల చేశారు. టాప్-10 ర్యాంకులతో పాటు 31వ ర్యాంకు వరకు పురుష అభ్యర్థులే ఉన్నారు. లక్కిరెడ్డి వినిషా రెడ్డి 32వ ర్యాంకు సొంతం చేసుకుంది. వినిషారెడ్డికి 408 మార్కులువచ్చాయి. టాప్ టెన్ అభ్యర్థుల్లో ఐదుగురు ఓసీలు కాగా, మిగతా ఐదుగురు బిసి కేటగిరికి చెందిన అభ్యర్థులు ఉన్నారు. టాప్-50లో ఇద్దరు ఎస్టీ అభ్యర్థులు ఉన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగాఉన్న 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి గత సంవత్సరం డిసెంబరు 15, 16 తేదీల్లో పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. పరీక్షకు 5.51 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 2.49 లక్షల మంది మంది మాత్రమే పరీక్షకు హాజరు అయ్యారు. గ్రూప్-2 పరీక్షలను 2,49,963 మంది అభ్యర్థులు రాశారు. వారిలో 2,36,649 మంది అభ్యర్థుల ర్యాకింగ్ లిస్టును టిజిపిఎస్‌సి విడుదల చేసింది. మరో 13,315 మంది ఫలితాలను విడుదల చేయలేదు. మంగళవారం ఫైనల్ కీతోపాటు అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్స్ జాబితా టిజిపిఎస్‌సి విడుదల చేసింది. అభ్యర్థుల మార్కులతో కూడిన జనరల్ ర్యాంకుల జాబితాను కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. కమిషన్ వెబ్‌సైట్‌లో గ్రూప్-2 ఓఎంఆర్ షీట్లు ఉంచింది.

**టాప్ టెన్ అభ్యర్థుల జాబితా ..**

| | | |
|---|---|---|
| నారు వెంకట హరవర్ధన్ (ఓసీ) | (మల్టీజోన్ 1) | - 447.088 |
| వడ్లకొండ సచిన్ (ఓసీ) | (మల్టీజోన్ 1) | - 444.754 |
| బి మనోహర్ రావు (బీసీడీ) | (మల్టీజోన్ 2) | - 439.344 |
| శ్రీరామ్ మధు (బీసీబీ) | (మల్టీజోన్ 2) | - 438.972 |
| చింతపల్లి ప్రీతమ్ రెడ్డి(ఓసీ) | (మల్టీజోన్ 1) | - 431.102 |
| అఖిల్ ఎర్ర (ఓసీ) | (మల్టీజోన్ 2) | - 430.807 |
| గొడ్డేటి అశోక్ (బీసీబీ) | (మల్టీజోన్1) | - 425.842 |
| చిమ్ముల రాజశేఖర్(ఓసీ) | (మల్టీజోన్2) | - 423.933 |
| మేకల ఉపేందర్ (బీసీడీ) | (మల్టీజోన్1) | - 423.119 |
| కారింగు నరేశ్(బీసీబీ) | (మల్టీజోన్ 2) | - 422.989 |

## సమ్మక్క వర్సిటీ విసిగా వైఎల్ శ్రీనివాస్

>> తెలంగాణలోని ములుగు జిల్లాలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి.. దానికి సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీగా నామకరణం చేసింది. 2024 మార్చిలోనే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తాత్కాలిక భవనాలలో యూనివర్సిటీని ప్రారంభించారు. రూ.889 కోట్లతో యూనివర్సిటీ నిర్మాణం తలపెట్టి.. కొత్త భవనాల నిర్మాణాన్ని ప్రారంభించారు. ట్రైబల్ యూనివర్సిటీ విసిగా నియమితులైన ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్ 1992లో ఉస్మానియా యూనివర్సిటీలో చేరారు. 2017 వరకు హైదరాబాద్ కోఠిలోని యూనివర్సిటీ కాలేజ్ ఫర్ ఉమెన్‌లోపని చేశారు. అనంతరం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్(ఓయూ)కి బదిలీ అయ్యారు. 2019 నంచి 2021 వరకు ఉస్మానియాయూనివర్సిటీలో ఇంగ్లీష్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చెర్మన్‌గా.. ఆ తరాత ఇంగ్లీష్ విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టారు. 2021 డిసెంబర్‌లో ఇంగ్లీష్ అండ్ ఫార్సన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో చేరారు. స్కూల్ ఆఫ్ లిటరరీ స్టడీస్(ఇంగ్లీష్ లిటరేచర్) విభాగంలో ప్రొఫెసర్‌గా బాధ్యతను నిర్వర్తించారు. గతంలో కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం తోపాటు మహబూబ్‌నగర్ పాలమూరు విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చెర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

## స్వయం ఉపాధి పథకాలు

>> మైనార్టీ కార్పొరేషన్లను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పథకాలు అందకపోవడంతో ఇబ్బందులు పడ్డారని వివరించారు. ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా యువతకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి రూ.3లక్షల చొప్పున సాయం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడించారు. 5లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఈ సంవత్సరం స్వయం ఉపాధి పథకం అందించడానికి ఈ నెల 15న నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. స్వయం ఉపాధి పథకం కోసం ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2వ తేదీన స్వయం ఉపాధి పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందజేస్తామని వివరించారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి తగిన మార్గదర్శకాలను అధికారులు రూపొందిస్తున్నారని చెప్పారు. సామాజిక స్పృహ కలిగిన ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించడం సామాజిక బాధ్యతగా తీసుకున్నదన్నారు.

**చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి రూ.540 కోట్లు**

వీరవనిత చాకలి ఐలమ్మ యూనివర్సిటీ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం 540 కోట్ల రూపాయలు కేటాయించిందని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దడానికి అద్భుతమైన నిర్మాణాలు చేయడానికి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ డిజైన్ చేసిందని ఈ సందర్భంగా తెలిపారు. యూనివర్సిటీలో ఉన్న హెరిటేజ్ భవనాలను పునరుద్ధరణ చేస్తామన్నారు.

## మారిషస్ అధ్యక్షుడికి గంగాజలాన్ని అందజేసిన ప్రధాని నరేంద్రమోడీ

**పోర్టులూయిస్, మార్చి 11:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ మారిషస్ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. తన పర్యటనలో భాగంగా మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకేల్‌తో ప్రధాని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గోకుల్‌కు అపురూప కానుక ఇచ్చారు. మహాకుంభమేళా నుంచి తీసుకెళ్లిన పవిత్ర గంగాజలాన్ని బహుమతిగా అందజేశారు. గంగాజలంతోపాటు ఇతర బహుమతులు కూడా ఇచ్చారు. అంతకుముందు మారిషస్ ప్రధాని డాక్టర్ నవీన్‌చంద్ర రామ్‌గులామ్‌తో మోడీ భేటీ అయ్యారు.

కాగా, రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ప్రధాని మోడీ మారిషస్ చేరుకున్న విషయం తెలిసిందే. బుధవారం జరిగే మారిషస్ 57వ జాతీయ దినోత్సవానికి ప్రధాని గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో కవాతు ఏర్పాటు చేస్తున్నారు. దాంట్లో భారతీయ సైనిక దళాలు పాల్గొంటున్నాయి. భారతీయ నౌకాదళ యుద్ధ విమానంతోపాటు వైమానిక దళానికి చెందిన ఆకాశ గంగా స్కైడైవింగ్ బృందం పాల్గొననుంది. హిందూ మహాసముద్రంలో ఉన్న మారిషస్‌తో భారత్‌కు గాఢమైన బంధం ఉన్నది. ఆఫ్రికా ఖండానికి వెళ్లేందుకు మారిషస్‌ను గేట్‌వేగా భావిస్తారు. హిస్టరీ, జియోగ్రఫీ, కల్చర్ ద్వారా రెండు దేశాలు కనెక్ట్ అయినట్లు మోడీ తెలిపారు.

## నేడు సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సిఎల్పీ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి11:** అసెంబ్లీలో అనుసరించే వ్యూహంపై చర్చించేందుకు అధికార కాంగ్రెస్ సన్నద్ధమైంది. ఈ మేరకు బుధవారం అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో సిఎల్పీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సిఎల్పీ సమావేశం కానుంది. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క,పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు,పార్టీ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహం, ప్రతిపక్షాలు చేసే ఆరోపణలు ఎదుర్కోవడం, ఎమ్మెల్యేలు,మంత్రుల మధ్య సమన్వయం, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమాచారం తదితర అంశాలపై చర్చకు రానున్నాయని సమాచారం.

# నేటినుంచి అసెంబ్లీ

>> సన్నద్ధమైంది. ఎంఐఎం, సిపిఐ అధికార కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలవనున్నాయి.

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి మొదలవనుండడంతో పోలీసులు భారీ భద్రత చేబట్టారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు, ప్రజా సంఘాల ఆందోళన నేపథ్యంలో అసెంబ్లీ పరిసర ప్రాంతాలలో ముందస్తుగా నిషేధాజ్ఞలు విధించారు. రెండు వారాలకు పైగా జరగనున్న ఈ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలోపల, వెలుపలా ఎక్కడా ఎలాంటిఅవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూసేందుకు సాయుధ బలగాలనుకూడా రంగంలో దించారు. అసెంబ్లీ సమావేశాలకు సర్కారు సమాయాత్తమవగా పోలీసులు అందుకు అనుగుణంగానే బందోబస్తు ఏర్పాట్లు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం అన్ని విభాగాలకు కేటాయింపులు జరిపే సంగతి అందరికి తెలిసిందే. ఈ కేటాయింపుల్లో ఓ విభాగానికి లేదా మరేదైనా వర్గానికి అన్యాయం జరిగిందని అనిపించినా దానికి సంబంధించిన వారు ఆందోళనకు దిగడం విదితమే. ఈ క్రమంలోనే అసెంబ్లీ సమీప ప్రాంతంలో ధర్నాలుచేయడం వీలైతే శాసనసభను ముట్టడించేందుకు ప్రయత్నించడం వంటివి చేయడానికి ప్రతిపక్ష పార్టీలతో పాటు ప్రజా సంఘాలు ప్రయత్నాలు చేస్తుంటాయి. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ వద్ద రక్షణ కోసం మూడంచల భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు భద్రతా బలగాల కోసం ప్రత్యేకంగా ఓ మార్గాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ మార్గం ఏర్పాటైన తరువాత అసెంబ్లీ సమావేశాల సమయంలో భద్రతా బలగాలు ఇక్కడ నిరంతరం మొహరించసాగాయి. అయినప్పటికీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలో ఇందిరా పార్కు, సుందరయ్య పార్కుల వద్ద ఆందోళనకు దిగిన ప్రజా సంఘాలు, నిరుద్యోగసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు చాలాసార్లు పోలీసుల వలయాన్ని ఛేధించుకుని శాసనసభ వరకు దూసుకువచ్చిన ఘటనలు అనేకం వున్నాయి. ఈ క్రమంలోనే ధర్నా చౌక్, ఇందిరా పార్క్ వద్ద ముందుగానే పోలీసులను మొహరించారు. అసెంబ్లీ లోపలకు కేవలం శాసనసభ్యులు, అనుమతులు వున్న అధికారులు, మీడియా సిబ్బంది, విధి నిర్వహణలో వున్న పోలీసులు మినహాయించి ఇతరులు రాకుండా చూడాలని ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ భవనాన్ని పోలీసులు ఇప్పటికే తమ అదుపులోకి తీసుకున్నారు. బుధవారం నుంచి మొదలుకానున్న సమావేశాల కోసం లోపల, వెలుపల పెద్ద సంఖ్యలో సా యుధ బలగాలను మొహరించారు. సమావేశాలు జరిగే సమయంలో ఆందోళనకారులు అసెంబ్లీ వైపు రాకుండా వుండేందుకు నాంపల్లి, రవీంద్ర భారతి చౌరస్తా, ఇక్బాల్ మినార్ చౌరస్తా, పబ్లిక్ గార్డెన్ చౌరస్తా, బాబు జగజీవన్ రాం చౌరస్తా, బషీర్‌బాగ్ చౌరస్తా, ఏ ఆర్ పెట్రోల్ బంకు చౌరస్తాతో పాటు సచివాలయం, తెలుగుతల్లి ఫ్లై ఓ వర్ బ్రిడ్జి, బషీర్‌బాగ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి తదితర ప్రాంతాలలో పోలీసులను మొహరించారు. ఎక్కడైనా తేడావచ్చి ఆందోళనకారులు దూసుకువస్తే వారిపై కఠినంగా వ్యవహ రించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. బడ్జెట్ సమావేశాలు సాఫీగా సాగేందుకు చేబట్టిన భద్రతా ఏర్పాట్లను ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

## లెక్చరర్లకి నేడు నియామక పత్రాలు

>> మంగళ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి నియామకం, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో, విద్యార్థులకు ఉత్తమమైన విద్యా వాతావరణం అందించడంలో ప్రభుత్వం గట్టి నిబద్ధత కలిగి ఉన్నామని తెలియజేస్తుందన్నారు. కొత్తగా నియమితులైన అధ్యాపకులకు విద్యా శాఖ విధానాలు, బోధన విధానాలపై ఓరియెంటేషన్, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిచడం జరుగుతుందన్నారు. వారిని రాష్ట్రంలోని వివిధ జోన్లలోని కాలేజీలకు నియమించి, బోధనా సిబ్బంది కొరతను తగ్గించి.. తద్వారా విద్యార్థుల అధ్యాపకుల మధ్య నిష్పత్తిని మెరుగుపరచడానికి వీలయ్యేలా చేయడం జరుగుతుందన్నారు.

## టెస్లా కారు కొంటున్నా

### మస్క్‌కు మద్దతుగా ట్రంప్ చర్యలు

**వాషింగ్టన్, మార్చి 11:** ఎలాన్‌మస్క్ చైర్మన్ సిఇఒగా ఉన్న టెస్లా కార్లను కొనుగోలుచేయవద్దని పిలుపు ఇవ్వడం అక్రమమని, ఒక గ్రేట్ అమెరికన్ పారిశ్రామికవేత్తకు తాను మద్దతుగా నిలుస్తానని, తాను మస్క్‌కు చెందిన టెస్లా కారును కొనుగోలుచేస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌ప్రకటించారు. రెండోసారి ఎన్నికైన తర్వాత అత్యంత శక్తివంతమైన సలహాదారుగా కొనసాగుతున్న మస్క్ టెస్లా కార్ల సేల్స్ పడిపోవడం, కొనుగోలుచేయవద్దంటూ ప్రత్యర్థుల పిలుపు ఇవ్వడంతో టెస్లా షేర్లుకూడా దెబ్బతిన్నాయి. అందువల్లనే గ్రేట్ అమెరికన్ టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ నిజమైన అమెరికా దేశస్తులని ఆయనకు మనం మద్దతుగా నిలవాలంటూ ట్రంప్ పిలుపునిచ్చారు. మస్క్ టెస్లా షేర్లుకూడా భారీగా పతనం అయ్యాయి. టెస్లాతోపాటే సోషల్‌మీడియా ఎక్స్, రాకెట్ ఉత్పత్తిసంస్థ స్పేస్‌ఎక్స్ సంస్థలను ఆయన నిర్వహిస్తున్నారు. అలాగే మరోపక్క ఫెడరల్ ప్రభుత్వంలో ఆయన డోజ్ సంస్థకకు ఛీఫ్‌గా కూడా ఉన్నారు. ఎలాన్‌మస్క్ మన దేశాన్ని గాడిలోపెట్టేందకు విశేష కృషిచేస్తున్నారని ట్రంప్ తన సోషల్‌మీడియా ట్రూత్‌లో వెల్లడించారు. కొందరు విప్లవ అతివాద ఛాందసులు టెస్లాను బాయ్‌కాట్‌చేయాలని పిలుపు ఇచ్చారని విమర్శించారు. టెస్లా ప్రపంచంలోని అతిపెద్ద కార్ల ఉత్పత్తి సంస్థల్లో ఒకటని, ఎలాన్ మస్క్ బేబీ సంస్థ అని మస్క్‌కు మద్దతుగా నిరంతరం కొనసాగుతానని ఆయన భరోసా ఇచ్చారు. అంతేకాకుండా న్యూయార్క్, వాషింగ్టన్ వంటి నగరాల్లో ఎలాన్ మస్క్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు కూడాజరిగాయి. టెస్లాస్టోర్లవద్ద యాంటీ డోజ్ నిరసనప్రదర్శనలునిర్వహించారు. అయితే వైట్‌హౌస్‌నుంచి అధికార ప్రకటన ఏదీ రాలేదు.

## రోబోలు

>> చారు.. ప్రమాద ప్రదేశంలో చేపట్టే సహాయక చర్యల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించ కుండ రోబోల సహాయక చర్యలు ఉపయోగించుకుంటున్నట్లు వివరించారు . సహాయక చర్యల్లో కావలసినసామాగ్రితో పాటు సహాయక బంధాలు మరోమారు కడవర్ డాగ్స్ ప్రమాద ప్రదేశానికి వెళ్లాయని తెలిపారు. ఈ సమావేశంలో,జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అన్వి రోబోటిక్స్, హైడ్రా అధికారులు, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూటీం, ర్యాట్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వే, కేరళకు చెందిన కడావర్ డాగ్స్ స్క్వాడ్ సహా సహాయక చర్యల్లో పాల్గొంటున్న అధికారులు హాజరయ్యారు.

## కెసిఆర్ జీతం నిలిపివేయండి..

### స్పీకర్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి11:** మాజీ సిఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. కేసీఆర్ ప్రతిపక్షనేతగా జీతభత్యాలు పొందుతూ అసెంబ్లీకి రావడం లేదంటూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు, అసెంబ్లీ సెక్రటరీకి హస్తం నేతలు ఫిర్యాదు చేస్తూ వినతి పత్రం అందజేశారు. మాజీ సీఎంకు వేతనం నిలిపివేయాలంటూ కాంగ్రెస్ లీడర్లు కోరారు. అలాగే ఇన్నిరోజులు కెసిఆర్‌కు ఇచ్చిన జీతాన్నికూడా రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. గత 14 నెలల నుంచి ఆయనకు ఇచ్చిన పదవిని సరిగ్గా నిర్వర్తించడం లేదని, ఇచ్చిన బాధ్యతను నెరవేర్చడంలో కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని.. అందువల్ల ఇన్ని రోజులుగా ఆయనకు ఇచ్చిన జీతాలను రికవరీ చేయాలని హస్తం నేతలు లేఖలో కోరారు. ప్రజల సొమ్మును కేసీఆర్ జీతంగా వాడుకుంటున్న నేపథ్యంలో వేతనాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇక ఈ విషయంపై బీఆర్ఎస్ నేతలు స్పందిస్తూ.. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఆయనను కించపరిచే అవకాశం ఉందని, హేళన చేసే ఛాన్స్ ఉంది కాబట్టే ఆయన అసెంబ్లీకి రావడంపై ఆలోచన చెప్పుకొస్తున్నారు.ఒకవేళ కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ర్యాగింగ్ చేస్తారనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ నేతలు పదే పదేఅసెంబ్లీకి రావాలని డిమాండ్ చేస్తున్నారనేది బీఆర్ఎస్ నేతల మాట.

## వారం - వర్జ్యం

తేది : 12-03-2025, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
శుక్ల త్రయోదశి ఉ.9.12
మఖ తె.4.04
వర్జ్యం మ.3.09-4.53
దు.మ.12.02-12.50
శుభసమయం : ఉ.9.30-10.30,
సా.5.40-6.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**వృషభం:** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఔషధ సేవనం అవసరం.

**మిథునం:** దూరప్రయాణాలలో తొందర పాటు వద్దు. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కుంటారు.

**కర్కాటకం :** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఖర్చులు పెరుగుతాయి. ప్రయాణాలు.

**సింహం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ఉద్యోగాలలో స్థానమార్పులు వుంటాయి.

**కన్య :** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. సేవారంగాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. రుణ వత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు.

**మకరం:** పనులలో ఆటంకాలు ఎదురై అధిగమిస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**కుంభం:** భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**మీనం :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. నూతన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ అయిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

## రెండు నెలల్లో గ్రీన్ సిగ్నల్

>> ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.

దాదాపు 95 శాతం భూసేకరణ కూడా పూర్తయిందని, రూ. 1000 కోట్లతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేశారని తెలిపారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఆరు లైన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని నితిన్ గడ్కరీ ఆదేశించినట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ఆలస్యమవుతోందని, దీంతో గుడిమల్కాపూర్ నుంచి విజయవాడకు ఒక ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులకు గడ్కరీ ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. 62 కి.మీ మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు. అదే విధంగా సోమశిల కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ మంజూరీపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రూ.205 కోట్లను మంజూరు చేసి త్వరగా మామునూర్ ఎయిర్‌పోర్టును పూర్తి చేసేలా చూస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు కోమటిరెడ్డి తెలిపారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎయిర్ పోర్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషితోనే కార్యరూపం దాల్చిందని చెప్పారు. మామూనరు ఎయిర్‌పోర్టుకు భూములు ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు కోసం జిఎంఆర్ నుంచి ఎన్‌ఓసీ తీసుకున్నామని పేర్కొన్నారు. రెండున్నర ఏళ్లలో ఎయిర్‌పోర్టు పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

## కాలుష్య దేశాల్లో మనం '5'

>> ఘజియాబాద్, న్యూఢిల్లీ, గురుగ్రామ్, గంగానగర్, గ్రేటర్‌నోయిడా, భివాండి, ముజఫర్‌నగర్, హనుమాన్‌గఢ్, నోయిడాలు ఉన్నాయి.ఇక ప్రపంచంలోనే అత్యంత కాలుష్యపూరిత రాజధానిగా ఢిల్లీ తొలిస్థానంలో కొనసాగుతోంది. 2023లో ఈసంస్థ విడుదలచేసిన జాబితాలో ప్రపంచంలోని మూడో అత్యంత కలుషిత వాతావరణ దేశంగా భారత్ నిలిచింది. ఇపుడు ఐదో అత్యంత కలుషిత దేశంగా ఇండియా నిలిచింది. ఈ కాలుష్యం వల్ల ప్రజల ఆయుష్షు సుమారు 5.2 సంవత్సరాలు తగ్గినట్లు నివేదికలు అంచనావేసాయి. 2009 నుంచి 2019వరకూ భారత్‌లోప్రతిఏటా కాలుష్య సంబంధిత వ్యాధులవల్ల సుమారు 1.5 మిలియన్లమంది అంటే 15 లక్షలమంది ప్రాణాలు పోతున్నట్లు గత ఏడాది విడుదలయిన లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ అధ్యయనం వెల్లడించింది. ఈ నివేదికలపై ప్రపంచ ఆరోగ్యసంస్థ మాజీ ప్రధాన శాస్త్రవేత్త ఆరోగ్యమంత్రిత్వశాఖ సలహాదారు సౌమ్య స్వామినాధన్ స్పందించారు. కాలుష్యనివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన వసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లల్లో వంటచెరకు ఉపయోగించడం వల్ల అక్కడిప్రజలు అధికంగా కాలుష్యకారక వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. వాటిని నివారించడానికి బయోమాస్‌ను ఎల్పీజీ సిలిండర్లతో భర్తీచేయడం వంటి అంశాలను ప్రజల్లో విస్తృత ప్రచారంచేయాలన్నారు. భారత ప్రభుత్వం ఇప్పటికే సంక్షేమపథకాన్ని అమలుచేస్తోందని,దీన్ని పూర్తిగా నియంత్రించాలంటే అదనపు గ్యాస్ సిలిండర్లపై రాయితీలు ఇవ్వాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండాకాలుష్య స్థాయి తగ్గే అవకాశం ఉందన్నారు. నగరాల్లో ప్రజారవాణాను విస్తరించడం, కొన్నిరకాల వాహనాలపైజరిమానాలు, ఆపై నిషేధించడం, పరిశ్రమలు నిర్మాణ సంస్థలు తగిన నిబంధనలు పాటించడం వంటి చర్యలతో కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు.

## మారిషస్ అత్యున్నత పురస్కారం

>> మంలో పాల్గొన్నారు. ఇదే వేదికపై రామ్‌గులాం ఈ ప్రకటనచేసారు. మారిషస్ దేశ 57వ జాతీయ దినోత్సవానికి ప్రధాని మోడీ గౌరవ అతిథిగా హాజరవుతున్నారు. ఈనేపథ్యంలో కవాతులో గౌరవ వందనం స్వీకరించారు. హిందూ మహాసముద్రంలో ఉన్న మారిషస్‌తో భారత్‌కు లోతైన మైత్రీ బంధం ఉంది. ఆఫ్రికా ఖండానికి వెళ్లేందుకు మారిషస్‌ను గేట్‌వేగా భావిస్తారు. చరిత్ర, భౌగోళికం, సంస్కృతిద్వారా రెండుదేశాలు కనెక్ట్ అయ్యాయని మోడీ ఈసందర్భంగా పేర్కొన్నారు. భారతనౌకాదళం, మారిషస్‌ల మధ్యసాంకేతిక ఒప్పందం జరుగనున్నది.

## జన్వాడ డ్రోన్ కేసుపై విచారుణ 19కి వాయిదా

>> పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. కాగా, తనపై పెట్టిన తప్పుడు కేసును కొట్టివేయాలని కోరుతూ సిఎం రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటీషన్ వేశారు. ఆ ఫాంహౌస్ ఉన్న ప్రాంతం నిషేధితం ఏమీ కాదని, తప్పుడుకేసులు పెట్టి రేవంత్‌రెడ్డి జైలుకు తరలించారని ఆయన తరఫున న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. ఈకేసులో కౌంటర్‌దాఖలు చేయాలని ఆదేశాలు జారీచేస్తూ విచారణను 19కి వాయిదా వేసింది.

## కేజ్రీవాల్, మరో ఇద్దరిపై కేసు

>> దర్యాప్తుప్రగతినివేదిక తమకు అందచేయాలని ఆదేశించారు. ఆప్ తన పబ్లిసిటీకోసం పదేళ్లుగా ప్రభుత్వ నిధులను దుర్వినియోగంచేస్తోందని బిజెపి ఆరోపిస్తూ వస్తోంది. గత ఏడాది జనవరిలో కూడా డిఐపి కూడా ఆప్‌ను 163.62 కోట్ల నిధులను వడ్డీతో కలిపి రీయింబర్స్‌చేయాలనికోరింది.

## అసెంబ్లీ సమావేశాలకు

# నేనూ వస్తున్నా

### ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి

### బిఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశంలో కెసిఆర్ దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి11:** తెలంగాణ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో కెసిఆర్ అధ్యక్షతన బిఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పలు అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం మూడు గంటలకుపైగా కొనసాగింది. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కెసిఆర్ దిశానిర్దేశం చేశారు. అందరం కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కృషి చేద్దామని కేసీఆర్ సూచించారు. అసెంబ్లీ సమావేశాలకు నేను కూడా వస్తున్నానని పార్టీ ప్రతినిధులతో కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ శాసన సభ, మండలి సభ్యులందరూ నిర్ణీత సమయానికి సభకు హాజరుకావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై చీల్చి చెండాడాలన్నారు. బిఆర్‌ఎస్‌పై ప్రభుత్వం చేస్తున్న తప్పుడు నిందలను తిప్పి కొట్టాలన్నారు.రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యలు, ఎండిన పంటలు, అందని కరెంటు, అందని సాగునీరు, కాలిపోతున్న మోటర్లు తదితర రైతాంగ సమస్యలపై, మంచినీటి కొరతపై అసెంబ్లీలో,మండలిలో పోరాడాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లు,ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలని,రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమవుతున్న తీరుపై మాట్లాడాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్,డిఎల పెండింగ్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు కొట్లాడాలన్నారు.ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలన్నారు. విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు.. విడుదల చేయకపోవడం గురించి.. వైద్య రంగంలో దిగజారుతున్న ప్రమాణాలు, తదితర ప్రజా సమస్యలపై ఎండగట్టాలన్నారు. దళితబంధును నిలిపివేయడంపై ప్రశ్నించాలన్నారు. గొర్రెల పెంపకం, చేపల పంపిణీ సమగ్ర అమలు కోసం.. అసెంబ్లీ మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలని సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా బీఆర్ఎస్ సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. సభలో ఇంకా ప్రతిభావంతంగా ప్రజాసమస్యలపై పోరాడేందుకు సభ్యులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకునేందుకు డిప్యూటీ లీడర్లను నియమించనున్నట్లు కేసీఆర్ తెలిపారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మధుసూధనాచారి, బండ ప్రకాశ్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత శాసనసభ సభ్యులు, మండలి సభ్యులు పాల్గొన్నారు.

# సుంకాల తగ్గింపుపై యుఎస్‌కు ఎలాంటి హామీ ఇవ్వలేదు

## కేంద్రం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, మార్చి 11:** అమెరికా నుంచి వచ్చే దిగుమతులపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటిస్తే భారత్‌ప్రభుత్వం మాత్రం సుంకాల తగ్గింపునకు ఎలాంటి హామీ ఇవ్వలేదని స్పష్టం చేసింది. ట్రంప్ రెండోసారి అదికారంలోకి వచ్చినప్పటినుంచి మిత్రులు, శతృవులు అని తేడా లేకుండా పలు దేశాలపై సుంకాలమోత మోగిస్తున్నారు. భారత్ తమ వస్తువులపై భారీగా సుంకాలు విధిస్తోందని ఆరోపించిన ఆయన వచ్చేనెల రెండోతేదీనుంచి తమ ప్రతీకార సుంకాలు ప్రారంభం అవుతాయని కూడా చెప్పారు. ఇటీవలే మరోసారి ఇదే అంశంప్రస్తావించిన ట్రంప్ భారత్ అత్యధికంగా సుంకాలు వసూలుచేస్తోందని ఆదేశంలో ఏవస్తువు విక్రయించడానికి వీలులేనంత భారంగా ఉన్నాయన్నారు. భారత్‌చర్యలను తాము బహిరంగపరచడంవల్ల సుంకాలను తగ్గించడానికి ఆదేశం అంగీకరించిందని వెల్లడించారు. అయితే భారత్ స్పందిస్తూ సుంకాల తగ్గింపుపై అమెరికాకు ఎలాంటి హామీ ఇవ్వలేదు. అమెరికా అధ్యక్షుడు పదేపదే లేవనెత్తుతున్న ఈసమస్య పరిష్కారానికి సెప్టెంబరువరకూ సమయం కోరాం అని పార్లమెంటరీ ప్యానెల్‌కు భారత ప్రభుత్వం వెల్లడించింది. భారత్ అమెరికా పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకునే దిశగా కృషిచేస్తున్నాయని తక్షణం సుంకాల సర్దుబాటుచేసుకునే బదులు దీర్ఘకాలిక వాణిజ్య సహకారంపై దృష్టి సారించాయని భారత వాణిజ్యశాఖ కార్యదర్శి వెల్లడించారు. ట్రంప్ పాలన భారత్‌పై సుంకాలు తదితర అంశాలపై విదేశాంగమంత్రి ఎస్‌జైశంకర్ స్పందించారు. ప్రపంచంలోని శక్తివంతమైన దేశాలన్నింటికీ సమాన అధికారాలు ఉండాలనే విధానంలోట్రంప్ పాలన సాగుతున్నదని అదిభారత ఆలోచనలకు సరిగ్గా సరిపోతుందని అన్నారు.



# బేగంపేట ఎయిర్‌పోర్టు వద్ద 0.600 కిలోమీటర్ల అండర్‌గ్రౌండ్ టన్నెల్ నిర్మాణం

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** హెచ్ఎండిఎ మరో కీలకమైన భారీ ప్రాజెక్టు నిర్మాణం చేసేందుకు సిద్ధమైంది. పారడైస్ నుంచి డెయిరీ ఫాం మీదుగా ఎన్‌హెచ్ 44లో నిర్మిస్తున్న భారీ ఫ్లైఓవర్‌కు కనెక్ట్ కానుంది. ఈ రహదారి నుంచి కేవలం 30 నిమిషాల వ్యవధిలో పారడైస్ నుంచి మేడ్చేల్‌కు వెళ్లే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. పారడైస్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్ కనెక్టివిటీ అయ్యే ఈ ప్రాజెక్టుకు హెచ్ఎండిఎ త్వరలోనే టెండర్లు పిలువనున్నారు. మొత్తం 5.40 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం సాగనుంది. అదేవిధంగా బేగంపేట వద్ద అండర్‌గ్రౌండ్ టన్నెల్ నిర్మాణం సాగనుంది. సికింద్రాబాద్, తాడ్‌బండ్ జంక్షన్, బోయిన్‌పల్లి జంక్షన్ మీదుగా నిర్మాణం సాగనుంది. ఈ కారిడార్ 5.400 కిలోమీటర్ల నిర్మాణం సాగనుండగా, ఈ కారిడార్ లెంత్ 3.050 కిలోమీటర్లు, బేగంపేట వద్ద అండర్‌గ్రౌండ్ టన్నెల్ 0.600 కిలోమీటర్ల మేర సాగనుంది. ఇప్పటికే బేగంపేట ఎయిర్‌పోర్టు వద్ద నిర్మించనున్న టన్నెల్‌కు ఎయిర్‌పోర్టు అథారిటీ అనుమతి ఇచ్చింది. దీంతో పాటు రక్షణ శాఖ అనుమతులు కూడా పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

# రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం సమావేశాలు

### పార్టీల నుంచి సలహాలు, సూచనలు స్వీకరణ

### 30వతేదీ నాటికి అందచేయాలి: సిఇసి జ్ఞానేశ్‌కుమార్

**న్యూఢిల్లీ, మార్చి 11:** దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికల ప్రక్రియ ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పలు సందేహాలులేవనెత్తుతుండటంతో వివిధ అపోహలు, సందేహాలను నివృత్తిచేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కీలక సమావేశం ఏర్పాటుచేస్తోంది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా



ఎన్నికల అదికారులు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని అన్ని జాతీయ రాష్ట్ర పార్టీలకు విజ్ఞప్తిచేసింది. వచ్చే ఏప్రిల్‌నెల 30వ తేదీనాటికి ఈ సలహాలు సూచనలను అందించాలనికోరింది. ఎన్నికల ప్రక్రియను మరింతగా బలోపేతంచేసేందుకు ఆపార్టీల అధ్యక్షులు, సీనియర్‌నేతలతో కూడా చర్చలు జరపాలని నిర్ణయించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీల సీనియర్ నాయకులు అందించే కీలక సూచనలను స్వీకరిస్తామని కేంద్ర ఎన్నికల సంఘ: ప్రకటించింది. రాజకీయ పార్టీలతో సిఇఒ, డిఇఒ, ఈఆర్‌వోలు సమావేశం కావాలని, ఆ సమావేశంలో వారు అందించే సమస్యలు, కీలక సూచనలను స్వీకరించి దానిపై నివేదిక ఏర్పాటుచేసి కమిషన్‌కు సమర్పించాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ఆదేశాలు జారీచేసారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగాప్రతిపక్షాలు దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా, గుర్తింపు కార్డుల అంశంపై ప్రశ్నలు లేవనెత్తాయి. దీనిపై చర్చ జరపాలని డిమాండ్‌చేస్తున్న సంగతి తెలిసిందే. వివిధరాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఈసీ స్పందించింది. అన్నిస్థాయిల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తాజాగా కోరింది.

# చిత్ర పరిశ్రమలో గద్దర్ అవార్డులకు సిఎం ఆమోదం

### విధివిధానాలు ఖరారు, 13 నుంచి దరఖాస్తుల స్వీకరణ

### సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు



**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** చిత్ర పరిశ్రమలో గద్దర్ అవార్డులకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం వ్యక్తం చేసింది. ఇందుకుగాను రూపొందించిన విధి విధానాలకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇందులో ఫీచర్ ఫిల్మ్ మరియు బాలల చిత్రాలు సహా వివిధ విభాగాలు ఉన్నాయని తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ మేరకు దీనికి సంబంధించి ఒక ప్రకటనలో ఈ సంవత్సరం నుండి టాలీవుడ్ సినిమాలు మరియు సినీ ప్రముఖులకు గద్దర్ అవార్డులను అందించేందుకు తాజాగా రూపొందించిన విధివిధానాలకు సీఎం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఈ క్రమంలో 2014 నుంచి 2023 వరకూ ఒక్కో సంవత్సరానికి ఉత్తమ చలన చిత్రానికి అవార్డు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందని వివరించారు. ఇందుకు గాను ఈ నెల మార్చి 13వ తేదీ నుంచి అవార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించనుండన్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణులతో పాటు, జాతీయ సమైక్యత చిత్రం, ఫీచర్ ఫిల్మ్, బాలల చలనచిత్రం విభాగం, హెరిటేజ్, పర్యావరణం, చరిత్రపై తీసే చిత్రాలకు పురస్కారాలు అందజేయనున్నారని తెలిపారు. యానిమేషన్ ఫిల్మ్, తొలి ఫీచర్ ఫిల్మ్, డాక్యుమెంటరీ ఫిల్మ్, సోషల్ ఎఫెక్ట్ ఫిల్మ్, షార్ట్ ఫిల్మ్ విభాగాల్లోనూ అవార్డును ప్రదానం చేయనున్నారని పేర్కొన్నారు. తెలుగు సినిమాపై విశ్లేషణాత్మక వ్యాసాలు, పుస్తకాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకూ అవార్డును ఇవ్వనున్నట్లు వెల్లడించింది. కాంతారావు, పైడి జయరాజ్, ఎం.ప్రభాకర్ రెడ్డి పేర్లతో అవార్డులు కొనసాగిం చాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అవార్డులకు నోటిఫికేషన్ జారీ చేస్తుందని చెప్పారు. ఉగాది నాడు వీటిని ప్రదానం చేసే అవకాశం ఉందని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రదానం చేసిన నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు ప్రకటించబడతాయని వెల్లడించారు. ఇందులో చలనచిత్రాలు, బాలల చిత్రాలు, తెలుగు పుస్తకా లతో సహా వివిధ విభాగాలలో అవార్డులను ప్రదానం చేస్తారు. జాతీయ స్థాయి కార్యక్రమాలతో సమానంగా అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించా లనేది ప్రభుత్వ నిర్ణయమన్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులరే ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. తర్వాత సాయంత్రం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా దిల్‌రాజ్ కలిశారు.

# పుష్ప-2కు వచ్చిన లాభాల్లో కళాకారులకూ వాటా

### హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** పుష్ప2కు వచ్చిన లాభాలను చిన్న చిత్రాలకు, బడ్జెట్ రాయితీకి వినియోగించాలని, జానపద కళాకారుల పింఛన్ కోసం కేటాయించాలని తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. న్యాయవాది నరసింహారావు ఈ పిల్ దాఖలు చేశారు. బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు వల్ల పుష్ప2 చిత్రానికి భారీగా ఆదాయం వచ్చిందని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. హోంశాఖ ప్రత్యేక ఉత్తర్వులిచ్చి మరీ బెనిఫిట్ షోలు, టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చిందని తెలిపారు. బెనిఫిట్ షో, టికెట్ ధరలు పెంపునకు అనుమతి వ్వడానికి గల కారణాలేంటో చెప్పలేదని కోర్టుకు వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చిత్రాల లాభాలను కళాకారుల సంక్షేమానికి కేటాయించాలని కోరారు. దీనిపై చీఫ్ జస్టిస్ స్పందిస్తూ ఇప్పటికే బెనిఫిట్ షోలు, టికెట్ల వసూలు ముగిసింది కదా అని ప్రశ్నించగా, వాటి వల్ల వచ్చిన లాభం గురించే పిటిషన్ దాఖలు చేశామని న్యాయవాది తెలిపారు. అందుకు తగిన విధంగా సుప్రీంకోర్టు తీర్పు కాపీని సమర్పించాలని ఆదేశిస్తూ విచారణ హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

# కాంగ్రెస్ అభివృద్ధిని బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారు!

### మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి హరీష్ రావు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని, సిఎం రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు హరీష్ రావుకు లేదన్నారు. మీరు బిజెపితో కుమ్మక్కు ఆ పార్టీని గెలిపించారన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఆకాంక్షలను నెరవేరుస్తుంటే తట్టుకోలేక పోతున్నారన్నారు.

# మరో రూ.3 వేల కోట్ల అప్పు చేసిన సర్కార్

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.3 వేల కోట్ల అప్పు తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈవేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టి ఈ మొత్తాన్ని తీసుకుంది. దీంతో ఈ నెలాఖరుతో ముగియనున్న 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం చేసిన అప్పు రూ.69,827 కోట్లకు చేరింది. ఇవి కాకుండా ఈ నెల 18వ తేదీన రూ.2000 కోట్లు, 25వ తేదీన రూ.2,500 కోట్ల రుణాలు తీసుకుంటామని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి సంబంధించిన ఇండెంట్లలో భాగంగా ఆర్‌బీఐకి తెలంగాణ సర్కార్ ప్రతిపాదించింది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని కేంద్ర ప్రభుత్వం 49,255 కోట్లకు విధించగా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మూడు త్రైమాసికాల్లో రూ.67,827 కోట్ల రుణం పొందింది. ఒకవేళ అదనపు రుణాలకు కూడా అనుమతి లభిస్తే రాష్ట్రం అప్పు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.70 వేల కోట్లకు పైగా చేరే అవకాశముంది. సాధారణంగా కేంద్రం అనుమతించిన మేరకే రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులను సేకరించాల్సి ఉంటుంది.

# మంత్రి కెటిఆర్ అవినీతిపై విచారణ జరిపించాలి

### పిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** మంత్రి కెటిఆర్ అవినీతిపై విచారణ జరిపించాలని టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో కెసిఆర్‌కు సరిపోయే వ్యక్తులు ఎవరు లేరు అని కెటిఆర్ అంటున్నాడు, కెసిఆం లాగ మేము 60వేల బుక్స్ చదవలేదన్నారు. కెసిఆర్ మాదిరిగా అబద్దాలు ఆడి,వేల కోట్లు ఎవరు దోచుకోలేదన్నారు. అధికారంలో ఉన్న పుడు కెసిఆర్ లాగ ఇంట్లో ఉన్నవారికి అందరికి పదవులు ఇవ్వలేదన్నారు. మిమ్ముల్ని నమ్ముకున్న ప్రజల్ని నట్టేట ముంచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపికి ఓటు వేయించారన్నారు.

# ఎంపి రఘునందన్‌రావుకు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** మెదక్ ఎంపి రఘునందన్‌రావుకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. నాగార్జునసాగర్‌లో రఘునందర్‌రావుపై నమోదైన కేసును హైకోర్టు కొట్టేసింది. 2021లో నాగార్జున సాగర్ ఉప ఎన్నిక సందర్భంగా రఘునందన్‌రావుపై ఎఫ్‌ఐఆర్ నమోదు అయింది. మోడల్ కోడ్ అమలులో ఉండగా, అనుమతి లేకుండా ప్రచారం నిర్వహించారని ఎంపిడిఓ దుబ్బసత్యం ఫిర్యాదు చేశారు. అయితే ఈ కేసును హైకోర్టు కొట్టేసింది.

# అప్పుల బాధతో ఇద్దరు రైతుల బలవన్మరణం

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త :** అప్పుల బాధ భరించలేక రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాల్లో ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లాలో యువరైతు, భువనగిరి జిల్లాలో కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం మహ్మద్‌హుస్సేన్‌పల్లికి చెందిన పూల మహేశ్ (39) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన పొలంలో మొక్కజొన్న, వరి, పల్లి సాగు చేశాడు. దిగుబడి రాకపోవడంతో రూ.30 లక్షల వరకు అప్పులయ్యాయి. వడ్డీ, అసలు కట్టే మార్గం కనిపించక మనస్తాపంతో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. అలాగే భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురానికి చెందిన మోటె నర్సింహ (50) 14 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పెట్టుబడి కోసం అప్పు చేశాడు. నీళ్లందక ఐదెకరాల పొలం ఎండిపోయింది. అప్పులు కట్ట లేనని ఐదురోజుల నుంచి మనస్తాపం చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పొలం వద్ద పురుగుల మందు ఆత్మహత్య చేసుకున్నారు.

# లిఫ్ట్ ప్రమాదంలో కమాండెంట్ గంగారాం మృతి

### మూడో అంతస్తు నుంచి కిందకు పడడంతో తీవ్రగాయాలు

### ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

**సిరిసిల్ల బ్యూరో, మార్చి 11, ప్రభాతవార్త:** ఇటీవల లిఫ్ట్‌లో ఇరుక్కుని ఓ బాలుడు మృతిచెందిన సంఘటన మరువకముందే రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో లిఫ్ట్ నుంచి కిందపడి ఓ కమాండెంట్ మృత్యువాత పడిన సంఘటన చోటుచేసుకుంది. సిరిసిల్లలోని కొత్త బస్టాండ్ సమీపంలో అర్ధరాత్రి సమయంలో మూడో అంతస్తు నుంచి లిఫ్ట్ దిగడానికి లిఫ్ట్ వద్దకు చేరుకున్న కమాండెంట్ లిఫ్ట్‌డోర్ లాగగానే ఓపెన్ కావడంతో కిందపడి తెలంగాణ సచివాలయ మాజీ సిఎస్‌ఒ, సిరిసిల్ల 17వ బెటాలియన్ కమాండెంట్ తోట గంగారాం మృతి చెందారు. మూడో అంతస్తులోంచి కిందకు దిగడానికి గంగారాం లిఫ్ట్ వద్దకు వచ్చాడు. లిఫ్ట్ ఐరన్ డోర్ లాగగానే ఓపెన్ కావడంతో లిఫ్ట్ వచ్చిందనుకుని లోనికివెళ్లే క్రమంలో కిందపడిపోయాడు. దీంతో మూడో అంతస్తు నుంచి ఆయన గ్రౌండ్ ఫ్లోర్‌లిఫ్ట్‌లో పడిపోవడంతో తీవ్రగాయాలు కావడంతో వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగానే చనిపోయాడు. లిఫ్ట్ రాక ముందే డోర్ తెరుచుకోవడంతో ఈ సంఘటన జరిగిందని భావిస్తున్నారు. కమాండెంట్ గంగారాం చనిపోవడంతో పోలీసులు, కుటుంబసభ్యులు బోరున విలపించారు. ప్రమాదవశాత్తు చనిపోయిన బెటాలియన్ కమాండెంట్ గంగారాం మృతదేహానికి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా నివాళులు అర్పించారు. అలాగే ఎఎస్‌పి చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఒకటో బెటాలియన్ కమాండెంట్ మురళీ కృష్ణ, 3వ బెటాలియన్ కమాండెంట్ జమీల్ పాషా, 17వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, రాందాస్ స్థానిక బెటాలియన్ అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సిద్దులం గ్రామానికి చెందిన గంగారాం సిరిసిల్లలో బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదివరకు తెలంగాణ సచివాలయ సిఎస్‌ఒగా గంగారాం పనిచేశారు. గంగారాం మృతి పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంతాపం తెలిపారు. పోలీసు శాఖకు ఉన్నత సేవలందిస్తున్న గంగారాం ప్రమాదవశాత్తూ జరిగిన లిఫ్ట్ ప్రమాదంలో మరణించడం బాధాకరమని కెటిఆర్ పేర్కొన్నారు. గంగారాం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



కమాండెంట్ గంగారాం మృతదేహనికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా

# అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

### నగదు, బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం

### కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహ

**ప్రభాతవార్త, నడిగూడెం(సూర్యాపేట) :** గరిడేపల్లి పోలీసులు డిటెక్ట్ చేసిన 6 కేసులు మరియు హుజూర్ నగర్ పోలీసులు డిటెక్ట్ చేసిన 1 కేసు మొత్తం 07 దొంగతనం కేస్ లలో సుమారుగా 5 లక్షల విలువగల 09 తులాల బంగారం ఆభరణాలు మరియు రూ.1,01,000/ నగదు సీజ్ చేసి నలుగురు దొంగలను అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు.జిల్లా పోలీస్ కార్యాలయం లోఅధనపు ఎస్పి నాగేశ్వరావు, డి.ఎస్.పి శ్రీధర్ రెడ్డి, సి చరమంధ రాజు లతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఎస్పీ నరసింహ మంగళవారం వెల్లడించారు. కోదాడ డివిజన్ పరిధిలో గత నెలలో జరిగిన వరస దొంగతానాలపై అందుబాటులో ఉన్న సాంకేతిక ఆధారాలు, వనరుల సమాచారంతో అధికారుల పర్యవేక్షణలో హుజూర్నగర్ సర్కిల్ సీఐ చరమంద రాజు, గరిడేపల్లి ఎస్సై నరేష్, హుజూర్నగర్ ఎస్ఐ ముత్తయ్య, నేరేడుచర్ల ఎస్సై రవీందర్, టెక్నికల్ టీం పోలీస్ సిబ్బంది బాగా పనిచేసే దొంగలను పట్టుకోవడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

# హాజీపూర్, మిర్యాలగూడ కేసులలో శిక్ష అమలు చేయాలి

### కాంగ్రెస్ సీనియర్ నేత వి.హానుమంతరావు

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** హాజీపూర్, మిర్యాలగూడ కేసులలో నిందితులకు శిక్షను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ దళితుడైన ప్రణయ్ తన కూతురు అమృతను పెళ్లి చేసుకున్నాడని మారుతిరావు ప్రణయ్‌ని చంపిండు, చంపిన వాడికి ఉరి మిగతా వాళ్లకు యావజ్జీవ శిక్ష పడిందన్నారు. హాజీపూర్‌లో శ్రీనివాస్ రెడ్డి ముగ్గురు అమ్మాయిలను అత్యాచారం చేసి చంపాడని, అక్కడ ఎస్పీ మహేష్ భగవత్ కష్టపడి కేసును ఛేధించడాని, రెండు కేసులను ఛేదించిన మహేష్ భగవత్, రంగనాథ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.
హాజీపూర్‌లో శ్రీనివాస్ రెడ్డికి శిక్ష పడింది, కానీ ఇప్పటివరకు శిక్ష అమలు కాలేదన్నారు. హై కోర్టు అప్రూవల్ ఇవ్వడం లేదన్నారు. ఎందుకు వెంటనే శిక్ష వేయట్లేదని తాను హై కోర్టు చీఫ్ జస్టిస్‌కు లెటర్ రాసినట్లు తెలిపారు. వెంటనే హాజీపూర్, మిర్యాలగూడ కేసులో శిక్ష అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీటిపై సీరియస్ గా దృష్టి పెట్టాలని, లేదంటే పోలీసు వ్యవస్థ నిర్వీర్యం అవుతుందన్నారు.



# శబరిమల ఆలయ సన్నిధానంలో నేరుగా స్వామి దర్శనం

### మార్పులు చేపట్టనున్న ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు!

**తిరువనంతపురం, మార్చి 11:** శబరిమల అయ్యప్ప ఆలయంలోని సన్నిధానంలో 18 పవిత్ర మెట్లను అధిరోహించిన వెంటనే భక్తులు నేరుగా స్వామి దర్శనం అయ్యేలా మార్పులు చేయాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు నిర్ణయించింది. ఈ మార్పును ఈ నెల 15 నుంచి 12 రోజుల పాటు విష్ణుపూజ జరిగే రోజుల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని టిడిబి అధ్యక్షుడు పిఎస్ ప్రశాంత్ వెల్లడించారు.
ఇది విజయవంతమైతే తదుపరి మండల మకరవిళక్కు సీజన్‌లోనూ దీన్ని కొనసాగిస్తామని తెలిపారు. మెట్లను ఎక్కిన వెంటనే ప్రస్తుతం భక్తులను ఇక వంతెన మీదికి మళ్లిస్తున్నారు. అక్కడ వారు కొంత సమయం క్యూలో వేచి ఉండి అనంతరం స్వామి దర్శనం కోసం మరోవైపుకు వెళుతున్నారని ప్రశాంత్ చెప్పారు.
ఈ పద్ధతిలో భక్తులకు కేవలం అయిదు సెకన్ల వరకే దర్శనభాగ్యం దక్కుతోందన్నారు. భక్తులు మెట్లు ఎక్కిన వెంటనే దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొత్త మార్పు కారణంగా ప్రతి భక్తునికి 20 నుంచి 25 సెకన్లపాటు దర్శనం చేసుకునే వీలు కలుగుతుందన్నారు.

# మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు

### ఎస్కి డైరెక్టర్ రామేశ్వర్‌రావు

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** ప్రపంచంలో మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు రూపొందించామని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా 2025-26 సంవత్సరానికి షెడ్యూల్ ఆఫ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ వార్షిక క్యాలెండర్‌ను ఉన్నతాధికారుల సమక్షంలో కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర రావు ఆవిష్కరించారు. కాలేజీలోని సెంటర్ ఫర్ క్లయిమేట్ చేంజ్, సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్, డిజైన్ ప్రొటోటైప్, ఎన్విరాన్మెంట్ మేనేజ్ మెంట్, ఫ్యాకల్టీ డెవలప్ మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేనేజిమెంట్ టెక్నాలజీ, మైనింగ్ డివిజన్, పవర్ అండ్ ఎనర్జీ డివిజన్, క్వాలిటీ ప్రొడక్షన్, వాటర్ రిసోర్సెస్ మేనేజిమెంట్, ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ, స్కూల్ అఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ తదితర విభాగాల్లో ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి మార్చ్, 2026 వరకు నిర్వహించాల్సిన శిక్షణ కార్యక్రమాలను అధికారులు కచ్చితంగా అమలు చేయాలని డాక్టర్ రామేశ్వర్‌రావు ఆదేశించారు.

# కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బిసిలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

### బిసి సబ్‌ప్లాన్‌పై అసెంబ్లీలో ప్రభుత్వ విధానాన్ని ప్రకటించాలి

### సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్లో బిసిలకు అన్యాయం చేస్తే సహించేది లేదని కామారెడ్డి డిక్లరేషన్ కట్టుబడి ఉండా లని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండోసారి అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతుందని మొదటి బడ్జెట్లో బీసీల సంక్షేమానికి రెండు లక్షల 91 వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్ ఉంటే అందులో 9200 కోట్లు మాత్రమే కేటాయించి అందులోనూ రెండు శాతమే నిధులు ఖర్చు చేసిందన్నారు. గత బడ్జెట్ మీటింగ్ సమయంలో బీసీలగణాంకాలు అందుబాటులో లేనందున తక్కువ నిధులు కేటాయించారన్న జాజుల బీసీల జనాభా 56 శాతం ఉన్నారని అధికారికంగా తేల్చిన నేపథ్యంలో జనాభా ప్రకారం బడ్జెట్లో నిధులు కేటాయించాలన్నారు. అలాగే బీసీ సబ్‌ప్లాన్ కు 50 వేల కోట్లు కేటాయించాలని బీసీ, ఎంబీసీ సంచార జాతుల కార్పొరేషన్ లకు 5000 కోట్లు కేటాయించాలని 24 బీసీ కులాల ఫెడరేషన్లు కొనసాగుతున్నందున ప్రతి ఫెడరేషన్ 100 కోట్లు కేటాయించాలన్నారు. అలాగే బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలకు 7000 కోట్లు , సంక్షేమ కాలేజీ హాస్టళ్లకు బీసీ గురుకులాలకు సొంత భవనాలు కట్టించాలన్నారు. పూలే ఓవర్సీస్ విదేశీ విద్య నిధులను ఇంతవరకు విడుదల చేయలేదని తక్షణమే పూలే విద్య నిధికి ప్రతి సంవత్సరం 100 కోట్లు కేటాయించాలని ఆయన కోరారు అలాగే బీసీ కులాల్లోని 80 కులాలకు ఆత్మగౌరవ భవనాలు ఆదిలోనే నిలిచిపోయానని వీటి నిర్మాణానికి ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్ లో బీసీల వాటాపై ఈనెల 16న హైదరాబాదులో బీసీ మేధావులు బీసీ సంఘాలు కుల సంఘాలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి నిధులపై రాహుల్‌గాంధీకి, రేవంత్‌రెడ్డి నివేదిస్తామన్నారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్ ఆధ్వర్యంలో.. జరిగిన ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కుమార్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బిమని మంజూరు సాగర్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేష్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, కుందారం గణేష్‌చారి, బాలరాజుగౌడ్, శ్యాంకురుమ తదితరులు

# ములుగు ఘటనను సీరియస్‌గా తీసుకున్న రైతు కమిషన్

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** ములుగు జిల్లాలో మొక్కజొన్న విత్తన సాగుచేసే రైతులు అకారణంగా అనారోగ్యానికి గురవుతున్నారు. పశువులు చనిపోతున్నాయి. మొక్క జొన్న సాగుచేసే రైతులకే ఈ విధంగా జరగడంపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై వ్యవసాయ కమిషన్‌కు అక్కడి రైతులు లేఖ రాయడంతో.. కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. మొక్క జొన్న సాగుచేసే రైతుల వివరాలు, వేసిన విత్తనం, వాడిన పురుగుమందుల కంపెనీల వివరాలతో కూడిన సమాచారం వెంటనే కమిషన్‌కు చేర్చాలని ములుగు జిల్లా వ్యవసాయ అధికారులకు ఆదేశించింది.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుద్యోగులకు ఉద్యోగాలు

### పిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తున్నాయని, గత పది ఏళ్లలో సాధ్యం కాని గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాలు భర్తీ కాంగ్రెస్ ప్రభుత్వం లో సాధ్యం అయిందని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. గ్రూప్ 1, గ్రూప్ 2 కొత్త అభ్యర్థులు ప్రజాపాలనలో భాగస్వామ్యం కావాలంటూ పిలుపు నిచ్చారు.

వార్త


అత్యధిక శాతం జనాభా నిరుపేదలు, దౌర్భాగ్యులుగా ఉన్న సమాజం వర్ధిల్లదు. అటువంటి సమాజంలో సుఖశాంతులు పరిఢవిల్లవు.

-ఆడమ్ స్మిత్

# ప్రకృతితో పరాచకాలొద్దు!


మానవ తప్పిదాల వల్ల విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనేక మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఒక్క భారత దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా ఈప్రకృతి వైపరీత్యాలు అంతకంతకు పెరుగుతున్నాయి. ఆధునిక విజ్ఞానం ఎంతో ఆర్జించామని విర్రవీగే అమెరికా లాంటి దేశాలు కూడా ఈ వైపరీత్యాల నుంచి బయటపడలేకపోతున్నాయి. ముఖ్యంగా కారుచిచ్చులు ఆ దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. నగరాలకు నగరాలకే చిచ్చుపెడుతున్నాయి. ఇందుకు ముందుగా నిందించాల్సింది, తప్పుపట్టాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలే స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లుపొడవడం అత్యంత దురదృష్టకరం. చివరకు అభివృద్ధిపేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలు పెడితే కొండలనుతొలచి ప్రాజెక్టులు,రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట పొలాలను జనావాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ, విధ్వంసం కొనసాగుతూనే ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మరో యేడెనిమిదేళ్లలో భారత్ జనాభా నూటనలభైఐదు కోట్లకు చేరుకుంటుందని అందుకు తగినట్టుగా దేశంలోని సహజ వనరులపై ఒత్తిడి పెరుగుతుందని ముఖ్యంగా అటవీ సంపద హరించుకుపో తుందని స్పష్టంచేసింది. ఇప్పటికేభారత్‌లో దాదాపు ప్రతిరోజూ మూడువందల ముప్పైఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడిస్తున్నది. బొగ్గుగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీలోయ ప్రాజెక్టులకోసం అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. మానవుడికే కాదు పశుపక్ష్యాదుల అన్నింటికి హానిచేసే ప్లాస్టిక్‌వాడకం అంతకంతకు పెరిగిపోతున్నది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులు నిషేధించినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. యధేచ్ఛగా వాడుతున్నారు. ప్లాస్టిక్‌సంచి మట్టిలో కలిసి పోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ఎంతటి నష్టం చేకూరుస్తుందో ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికారవర్గాలు విఫలమవుతున్నాయనే చెప్పొచ్చు. ఇక పెట్రో, డీజిల్ వంటి ఇంధనాల వాడకం గురించి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్యం నియంత్రణ మాటలకే పరిమితమవుతుంది. ఇక పరిశ్రమలు వదులుతున్న పొగ ధూళికణాలు తదితరవన్నీ కలిసి వాయుకాలుష్యాన్ని తారాస్థాయికి తీసుకుపోతున్నాయి. ముఖ్యంగా వాయుకాలుష్యంతో దేశంలో లక్షలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిని నియంత్రించేందుకు అటు కేంద్ర,ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సఫలీకృతం కావడంలేదు. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఈసారి వేసవిలో అత్యధికంగా ఉష్ణోగ్రత ఉంటుందని, నలభైయేడు డిగ్రీల వరకు వెళ్లినా ఆశ్చర్యంలేదని శాస్త్రవేత్తలే అంచనా వేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీరప్రాంతాలు, దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని గతంలోనే పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇక ఇలా ప్రకృతి మనిషితో ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతిగా ప్రకృతి తీవ్రంగా స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిస్తే ఒకే ప్రాంతంలోకుంభవృష్టి కురవడం ఇటీవలకాలంలో పెరిగిపోతున్నది. వరదలు, తుఫాన్లు, భూకంపాలు లాంటి ఉపద్రవాలు చోటు చేసుకుంటున్నాయి. యేటా ప్రపంచవ్యాప్తంగా మూడువందల ఎనభైకి పైగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. ఈ ఉపద్రవాల కారణంగా యేటా లక్షలాది మంది ప్రాణాలు పోగొట్టుకుంటుంటే కోట్ల సంఖ్యలో రోగపీడితులు అవుతున్నారు. పాకిస్థాన్, ఇరాన్, హైతి, న్యూజిలాండ్, నేపాల్ లాంటి ఎన్నోదేశాలలో గతయేడాది అంతకుముందు వచ్చిన భూకంపాలు ప్రళయమే సృష్టించాయని చెప్పొచ్చు. మొన్న ఆ మధ్య సిరియాలో వచ్చిన భూకంపం కారణంగా యాభైతొమ్మిదివేల మందిఅసువులుబాశారు. ఆ తర్వాత మొరోకాలో వచ్చిన ప్రకంపనాలతో దాదాపు నాలుగువేల మంది జీవితాలు సమాధి అయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ భూ ప్రకంపనాలు సృష్టించిన విలయాల నుండి బాధితులు కోలుకోలేకపోతున్నారు. భారత్‌కు సంబంధించి కూడా అనేకప్రాంతాలో భూప్రకంపనాలు తరుచుగా వస్తూనేఉన్నాయి. చెన్నై,పూణె, ముంబాయి, కోల్‌కతా, ఢిల్లీ లాంటి దాదాపు డెబ్బైనగరాల్లో భూకంపాలు పొంచిఉన్నట్లు శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. పాలకులు తీసుకుంటున్న ముందుజాగ్రత్తల వల్ల ఉపద్రవాలకు సంబంధించి ప్రాణ, ఆస్తుల నష్టం కొంతవరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణం సమతుల్యం దెబ్బతిన్నకారణంగా ఏర్పడుతున్న ప్రకృతి విజృంభణకు అడ్డుకట్టవేయలేకపోతున్నారు. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్నికాపాడేందుకు త్రికరణ శుద్ధిగా కృషిజరగాలి.ప్రజల్లో అవగాహన పెంచాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా మరెన్నో ప్రళయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

జీవితానికి విశ్వాసం పునాదిలో ఉండాలి. విశ్వాసం లేకుండా ఏ పని చేసినా వ్యర్థమే.



షేక్‌స్పియర్

జ్ఞానం ఉపదేశాల వల్ల, ఉపన్యాసాలు వినటంవల్ల రాదు. అనుభవపూర్వకంగా మాత్రమే వస్తుంది.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



### పరీక్షలంటే విద్యార్థులకు కారాదు అగ్ని పరీక్ష!

మార్చినెలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అలాగే ఈ పరీక్షల అనంతరం ఫలితాలు విడుదలైనప్పుడు ఫెయిల్ అయినవిద్యార్థులు వెంటనే విపరీత నిర్ణయాలు తీసుకుంటుండటం తీవ్రబాధ కలిగిస్తుంది. జీవితమంటే కేవలం పరీక్షలేకాదు ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని నిరుత్సాహపడకుండా విద్యార్థి ప్రయత్నాన్ని కొనసాగించాలి. ప్రతీ విద్యార్థికి అంతర్గతంగా ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని గుర్తించి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలి. చదువుల పేరుతో వారిని విపరీతమైన ఒత్తిడికి లోనుకాకుండా చేయవలసిన బాధ్యత కూడా తల్లిదండ్రులదే. పిల్లల అభిరుచులు ముందుగా తెలుసుకుంటే విద్యార్థుల విపరీత నిర్ణయాలు కొంత వరకూ అరికట్టవచ్చు.

-దాసం వెంకటరెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా

### అర్థశాస్త్రం సబ్జెక్టును అభివృద్ధి చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ అనుమతి ఉన్న జూనియర్ కళాశాలలకు తప్పనిసరిగా సామాజిక శాస్త్రాలలో భాగమైన అర్థశాస్త్రంసబ్జెక్టునుతప్పకుండా 2025-2026 విద్యా సంవత్సరం నుండి ప్రవేశపెట్టాలి. అర్థశాస్త్రం జూనియర్ కళాశాలలో గురుకుల కళాశాలలో పోస్టులు సాంక్షన్ అయ్యి కూడా కొన్ని కళాశాలలో అర్థశాస్త్రం బోధించడం లేదు. అర్థశాస్త్రం సబ్జెక్టులను నిర్లక్ష్యం చేయడం జరుగుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో ఆర్థిక శాఖమంత్రినీ నియమిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఇంటర్మీడియట్‌లో అర్థశాస్త్రాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. వార్షిక బడ్జెట్లను ప్రవేశపెడుతున్నారు. ఎక్కడ సాంక్షన్‌అయిన సబ్జెక్టులను అక్కడనే ఉంచాలి. ఆకళాశాలల్లోనే అర్థశాస్త్రం సబ్జెక్టులను బోధించాలి. ఇతరప్రాంతాలకు ఈసబ్జెక్టులను తరలించవద్దు.

-రాపాక రవీందర్, జనగాం

### రైళ్లలో మిడిల్ బెర్తలను తొలగించాలి

భారతీయ రైల్వేశాఖ ప్రయాణికుల కోసం సౌకర్యవంతమైన అందమైన అత్యాధునిక భోగిలను ఏర్పరుస్తున్నది. కాలానుగుణముగా అవసరాలకు తగ్గట్టుగా ప్రస్తుతం జనరల్ స్లీపర్ థర్డ్ సెకండ్ ఫస్ట్ ఏసీక్లాస్ భోగిలను నడుపుతున్నారు. ప్రయాణికులు పడుతున్న కష్టనష్టాలను దృష్టిలో ఉంచుకొని వాటిని కూషన్ సీట్లుగా మార్చారు.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

### ప్రమాదాలను నివారించాలి

గత రోజుల్లో కన్న ప్రస్తుతం వాహనాలు అన్ని రకాలూ విపరీతంగా పెరిగినవి. ప్రయాణాలు కూడా పురుషులతో పాటు స్త్రీలుకూడా అత్యవసర ప్రయాణాలు చేస్తున్నారు. రోడ్ల పరిస్థితి బాగున్నా నడుపుతున్న వారు ట్రాఫిక్ నియమాలను పాటించడంలోభద్రత, నియమిత వేగం, ఎదుటిచూపూ లేకపోతే క్షణాల్లోప్రమాదం తప్పదు. ప్రమాదాల నియంత్రణ కోసం ట్రాఫిక్‌లో ఉల్లంఘనకు మోటార్ వెహికల్ చట్టం ప్రకారం మార్చిన జరిమానాలుకాస్త ఎక్కువగానే ఉన్నవి. కానీ జరిమానాలు దృష్టిలో పెట్టుకొని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ముందు జాగ్రత్తగా అన్ని చూసి వాహనాన్ని నడపడం మన ప్రాణ రక్షణ కోసమే అని నమ్మి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలి. రహదారిపై పోలీసులేకపోయినా సిగ్నల్ ప్రకారం వెళ్లి ఎదుటి ప్రయాణికుని గమనిస్తూ నిదానంగా పోవాలి. వేగం కన్నా ప్రాణం మిన్న అన్న భావన బోర్డు కన్న మన ఆచరణ ,భయంలోనే ఉంది.

-బొల్లోజు మేఘానాథమ్, విశాఖపట్నం

### ఇంకా పురుషాధిక్య సమాజమే

ప్రతిఏటా మార్చి ఎనిమిదవ తారీఖున నారీ దినోత్సవం పేరిట మహిళా మణులను తలచుకోవడం, వారి శక్తిని కీర్తించడం ఆతరువాత మరవడం ఇవన్నీ ఏటా వచ్చే ఉత్సవం లాంటివి. చట్టసభలలో ముప్పై మూడు శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ముప్పైఏళ్ళపై నుండి వాగ్దానాలను చేయడమే కాని వాస్తవరూపం దాల్చడం లేదు. దేశంలో ఉండే మహిళల్లో ఎంత శాతం ఉద్యోగాల్లో గాని ఇతర రంగాల్లో గాని రాణిస్తున్నారు. అంటే బహు తక్కువ అని తెలుతుంది. దేశం ఎంతో పురోభివృద్ధి చెందుతోందన్న వార్తలోస్తున్నా, మహిళలు అనేకరకాలుగా ఇప్పటికి చిత్రహింసలకు గురవుతున్నారు. మహిళా సాధికారికత అనేది పేపర్లలో ప్రచురించ దగ్గ అందమైన పదం మాత్రమే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పెన్షన్ ఫండ్ చెల్లించాలి

కోల్ ఇండియా, సింగరేణి బొగ్గు గని అధికారులకు కార్మికులకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ద్వారా దాదాపు ఐదు లక్షల మందికి పింఛన్ చెల్లిస్తున్నారు. అధికారులు, కార్మికుల వద్ద బేసిక్ నుంచి ఏడు శాతం వసూలు చేసి యాజమాన్యాలు ఏడుశాతం కలిపి పెన్షన్ ఫండ్‌కు జమ చేస్తున్నారు. పెన్షన్ ఫండ్‌కు వచ్చిన మొత్తం కంటే 316.23కోట్లు తక్కువ జమ కావడంతో చెల్లింపుల మధ్య ఆంతర్యం పెరుగుతుంది.

-కె.రామారావు, నల్గొండ జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వాస్తవానికి దూరంగా మద్దతు ధరలు!

**'స్వతంత్ర ' పాలన ప్రారంభం నుండి నేటివరకు పాలక ప్రభుత్వాలన్నీ రైతాంగ వ్యతిరేక విధానాలనే అనుసరించాయి. రైతాంగ ప్రయోజనాలను హరించి, బడావ్యాపారుల ప్రయోజనాలకు అనుకూలంగా పంటల మద్దతు ప్రకటిస్తున్నాయి. గిట్టుబాటుగాని ధరల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయారు. నాలుగు లక్షల మంది రైతులు అప్పులు తీర్చేమార్గం కనపడక బలవన్మరణాల పాలయ్యారు. రైతాంగం, రైతు, రైతు కూలీ సంఘాలు పంటలకు న్యాయబద్ధమైన మద్దతు ధరలు ప్రకటించి, వాటికి చట్టబద్ధత కల్పించి, ప్రభుత్వమే కొనుగోళ్లు చేయాలనే డిమాండ్ చేస్తున్నాయి. ఆ ఉద్యమాలను చేసి కేంద్రప్రభుత్వం దిగివచ్చేలా చేయాలి. అప్పుడే న్యాయమైన మద్దతు ధర లభిస్తుంది.**

బొల్లిముంత సాంబశివరావు

దేశానికి రైతే వెన్నెముక అంటూనే, ఆ వెన్నెముకను విరిచే విధానాలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. అధికార మార్పిడి జరిగిన నాటి నుండి నేటి వరకు రైతాంగ ప్రయోజనాలు కాపాడే వ్యవసాయ విధానాలను పాలక పార్టీలు, ప్రభుత్వాలు అమలు జరపకపోగా హరిస్తున్నాయి. పండించే పంటలకు న్యాయమైన ధర లభించకపోతే రైతుకు నష్టదాయకంగా మారి సేద్యమే సంక్షోభంలో పడుతుంది. నేడు భారత రైతాంగం ఈ సమస్యనే ఎదుర్కొంటున్నారు. నెహ్రూ పాలనలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసే విధానాలు అమలు చేయని ఫలితంగా దేశంలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడింది. అవమానకరమైన పిఎల్480 ఒప్పందం ద్వారా అమెరికా నుండి పెద్దఎత్తున గోధుమలు దిగుమతి చేసుకున్నాం. ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచేవిధంగా రైతాంగానికి మేలురకమైన విత్తనాలు,పంటకు కావాల్సిన పెట్టుబడి, నాణ్యమైన ఎరువులు, మంచి ధర లభించే మార్కెట్ సౌకర్యం కల్పించి ఉంటే ఆహారసంక్షోభం వచ్చేదికాదు. భారత వ్యవసాయ రంగాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవటానికి అనుగుణమైన విధానాలను అమెరికా అమలు జరిపింది. మొదట ముక్కిపోయిన గోధుములను భారతదేశానికి ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంది. తమ దేశ ఎరువుల రంగానికి భారత దేశాన్ని పెద్దమార్కెట్‌గా మార్చే వ్యూహాత్మక విధానాలకు సిద్ధమైంది. అందుకుఫోర్డు ఫౌండేషన్ను ఉపయోగించింది. 1959లో భారతదేశానికి వచ్చిన ఈ ఫౌండేషన్నాట్లు వేయటానికి ముందే పంటలకు కనీస మద్దతుధర ప్రకటించాలని భారత ప్రభుత్వానికి సూచించింది. దానికి అనుగుణంగానే వ్యవసాయ ధరల కమిషన్ ఏర్పాటుకోసం 1964లో ఎల్కే ఝా అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసింది. దాని సిఫార్సుల ఆధారంగా 1965లో వ్యవసాయ ధరల కమిషన్ (ఏపీసీ)ఏర్పడింది. ఇది ప్రతి సంవత్సరం మద్దతుధర సేకరణ గురించి ప్రకటిస్తుంది. ఏపీసీని 1985లో వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్‌గా కేంద్రప్రభుత్వం మార్చింది. ముందుగానే మద్దతు ధర ప్రకటించమని ఫోర్డు ఫౌండేషన్ చెబితే, పంటల దిగుబడి పెంచటానికి సస్యవిప్లవం ప్రకటించమని ప్రపంచబ్యాంకు భారత ప్రభుత్వానికి చెప్పింది. సస్యవిప్లవం పేరుతోఅమెరికా కంపెనీల ఎరువుల, పురుగుమందుల వ్యాపారానికి భారతదేశాన్ని ముఖ్యకేంద్రంగా మార్చటమే ప్రపంచ బ్యాంకు ఎత్తుగడ. ప్రపంచబ్యాంకు సూచనలకు అనుగుణంగా 1966లో దేశంలో సస్యవిప్లవాన్ని ప్రభుత్వం ప్రకటించింది. అమెరికానుంచి హైబ్రీడ్ విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగుమందులు దేశంలోకి దిగుమతి అయ్యాయి. సస్యవిప్లవ ఫలితంగా రైతాంగానికి పంట ఖర్చులు పెరిగాయి. అందుకు తగ్గ ఆదాయం మాత్రం రైతాంగానికి లభించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పంటలకు మద్దతు ధర అంశం ముందుకు వచ్చింది. ఈసందర్భంగా జరుగుతున్న చర్చలో విధాననిర్ణేతలు, పరిశోధకులు, ఆలోచనపరులు ప్రభుత్వపెట్టుబడులు లేదా ఇన్పుట్ సబ్సిడీల ద్వారా ఉత్పత్తి వ్యయానికి మద్దతు మార్గాలను సూచించారు. 1964లో ఎల్కే ఝా కమిషన్ సిఫార్సుల మేరకు రైతాంగానికి మద్దతు ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం స్వీకరించింది. ఒకనిర్దిష్ట పంట ఉత్పత్తి వ్యయాన్ని అంచనా వేయటానికి అనుసరించే విధానాలను వ్యవసాయ ఖర్చుల ధరల కమిషన్( సీఏసీపీ) ప్రచురించిన వార్షిక ధరల విధాన నివేదికలో పేర్కొన్నారు. ఈనివేదిక ప్రకారం సీఏసీపీ భారత దేశంలో ప్రధాన పంటలసాగు ఖర్చును అధ్యయనం చేయటానికి 'సమగ్రపథకాన్ని' 1971 నుండి అమలు చేసింది. ఈ పథకం ద్వారా మూడు సంవత్సరాల ఖర్చులను కలిపి పంటల ఉత్పత్తి ఖర్చును వ్యవసాయ ధరల కమిషన్ నిర్ణయిస్తుంది. ఈవిధానం రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీస్తుంది. రెండు సంవత్సరాల పంట ఖర్చులు తక్కువ ఉంటే, ఆ ఖర్చును మూడవ సంవత్సరం పంట ఖర్చులతో కలిపి నిర్ణయించటం వలన పంట ఖర్చు తక్కువగా నమోదు అవుతుంది. దాన్ని ఆధారం చేసుకుని



కేంద్రప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర తక్కువ ప్రకటిస్తుంది. అంతేకాకుండా పంటల ఉత్పత్తి ఖర్చును రాష్ట్రాల వారీగా సేకరించి దానిని దేశసగటుగా నిర్ణయించటం జరుగుతున్నది. ఒక పంటకు సాగు ఖర్చులో రాష్ట్రాల మధ్య వ్యత్యాసం ఉంది. దీనివల్ల ఎక్కువ ఖర్చు ఉన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతున్నది. ప్రతి సంవత్సరం రాష్ట్రాలవారీగా పంటఖర్చును లెక్కించి ఆయారాష్ట్రాలకు విడిగా మద్దతు ధరను ప్రకటిస్తే రైతాంగానికి ప్రయోజనంగా ఉంటుంది. కేంద్రప్రభుత్వం అలా చేయకపోవటం రైతాంగ వ్యతిరేక విధానాలకు నిదర్శనం. ఒకపంటకు ఉత్పత్తి వ్యయం అనేది పంటకోసం పెట్టినఖర్చు. భూమి అద్దె,కుటుంబ శ్రమ,అప్పులకు వడ్డీ, మూలధనంపై వడ్డీ తదితరాలు లెక్కించి నిర్ణయించాలి. అది సమగ్ర ఖర్చుగా ఉంటుంది. కేంద్రప్రభుత్వాలు, వ్యవసాయ వ్యయ ధరల కమీషన్ ఆవిధంగా పంట వ్యయాన్ని లెక్కించటం లేదు. బ్యాంకులు ఇచ్చే పంటరుణం ప్రామాణికంగా తీసుకుని పంటకు మద్దతు ధరను ప్రకటిస్తున్నాయి. ఫలితంగా రైతాంగానికి సేద్యం గిట్టుబాటుకాక అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఎంఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ రైతు కమిషన్ కనీస మద్దతుధర సగటు ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50శాతం ఎక్కువగా ఉండాలని సిఫార్సు చేసింది. 1979-80లో ఉత్పత్తి వ్యయం అంచనాలపై ప్రత్యేక నిపుణుల(యస్ ఆర్సేన్) కమిటీ, 1990లో ఏర్పాటు చేయబడిన పంటల ఉత్పత్తి వ్యయ పద్ధతి సమీక్ష కోసం నిపుణుల కమిటీ, పంటల వ్యయం గురించి సీఏసీపీ ఉపయోగించిన పద్ధతికి సంబంధించిన అనేక సమస్యలు లేవనెత్తాయి. సేన్మరియు భాటియా కమిటీలు కూడా యాజమాన్యంలోని భూమి అద్దెవిలువను కూడా ఉత్పత్తి వ్యయంలో లెక్కించబడుతుందని ఎత్తిచూపారు. భూయజమాని మూలధనంపై వడ్డీఖర్చు 10శాతంగా అంచనా వేసింది. ఈ సిఫార్సులను ప్రభుత్వాలు, సీఏసీపీ పరిగణలోకి తీసుకోలేదు. 2014లో కేంద్ర నాయకత్వాన మొదటిసారి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు 2022నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పింది. ఇంతవరకు ఆచరణలో అమలు జరగకపోగా నేడు దాని ఊసే ఎత్తటంలేదు. రైతుల ఆదాయం పెరగకపోవటంపైన, మద్దతు ధరలపైన కేంద్రప్రభుత్వంపై వివిధ రూపాల్లో వ్యతిరేకత పెరుగుతూ ఉండటంతో, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా పంట ఉత్పత్తివ్యయంపై అదనంగా 50శాతం పెంచి మద్దతు ధరను ప్రకటిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడే కేంద్రప్రభుత్వ వంచన బయటపడింది. స్వామినాథన్ కమిషన్ చెప్పినట్లు అన్నిరకాల ఖర్చులను లెక్కించకుండా, ఒక్కపంట ఖర్చునే తీసుకుని దానిపై 50శాతం పెంచి మద్దతు ధరను ప్రకటిస్తున్నది. 2024-25 సంవత్సరానికి ఎకరా సేద్యపుపంట ఖర్చు 28వేలుగా నిర్ధారించి, సగటు దిగుబడి 20క్వింటాళ్లు నిర్ణయించి,క్వింటాల్ ఉత్పత్తి ఖర్చు 14వందలు పేర్కొని దానిపై 50శాతం పెంచి 2100 రూపాయలుగా ప్రకటించి దాన్ని 2300రూపాయలకు పెంచింది. పంట ఖర్చు, కౌలు ఖర్చు, కుటుంబ శ్రమ, అప్పుల వడ్డీలతో వాస్తవ వ్యయం 64వేలు. క్వింటాల్ ఉత్పత్తిఖర్చు రూ.3200. దానిపై 50శాతం కలిపితే రూ.4,800గా మద్దతుధర ప్రకటించాలి. దీన్ని గమనించినప్పుడు స్వామినాథన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం వక్రీకరించి విధానం తెలుస్తుంది. మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించటానికి నిరాకరిస్తున్నది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, మద్దతు ధర 50శాతం పెంచుతానని మోసపుచ్చుతూ వచ్చిన కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయచట్టాల ద్వారా మద్దతు ధరలకే మంగళం పాడి పంటల సేకరణ నుంచితప్పుకుంటే, ఆ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమం ఉవ్వెత్తున సాగటంతో, చట్టాలను ఉపసంహరించుకోక తప్పలేదు. 'స్వతంత్ర ' పాలన ప్రారంభం నుండి నేటివరకు పాలక ప్రభుత్వాలన్నీ రైతాంగ వ్యతిరేక విధానాలనే అనుసరించాయి. రైతాంగ ప్రయోజనాలను హరించి, బడావ్యాపారుల ప్రయోజనాలకు అనుకూలంగా పంటల మద్దతు ప్రకటిస్తున్నాయి. గిట్టుబాటుగాని ధరల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయారు. నాలుగు లక్షల మంది రైతులు అప్పులు తీర్చేమార్గం కనపడక బలవన్మరణాల పాలయ్యారు. రైతాంగం, రైతు, రైతు కూలీ సంఘాలు పంటలకు న్యాయబద్ధమైన మద్దతు ధరలు ప్రకటించి, వాటికి చట్టబద్ధత కల్పించి, ప్రభుత్వమే కొనుగోళ్లు చేయాలనే డిమాండ్ చేస్తున్నాయి. ఆ ఉద్యమాలను చేసి కేంద్రప్రభుత్వం దిగివచ్చేలా చేయాలి. అప్పుడే న్యాయమైన మద్దతు ధర లభిస్తుంది. •

# ధూమపాన నిర్మూలనకు చర్యలేవి?

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

అత్యధిక మరణాలకు కారణంగా నిలుస్తున్న పొగ తాగడమనే దులవాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ప్రతి యేటా 12 మార్చిన నేషనల్ నో స్మోకింగ్ డే నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఊపిరితిత్తులకు సంబంధించిన ప్రాణాంతక వ్యాధులు, శరీరంలో ప్రాణ వాయువు మోతాదులు తగ్గడం, బీపీ/స్ట్రోక్ లాంటి హృద్రోగాలకు దారి తీస్తున్న పొగ తాగడమనే దురలవాటు బారిన పడిన మిలియన్ల ప్రజలు మరణం అంచున తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకోవడం, కుటుంబాలు ఆర్థిక సమస్యలను ఎదుర్కోవడం, కుటుంబ సభ్యులు అనాథలుగా మారడం లాంటి ప్రతికూలతలు పొగరాయుళ్లను వెంటాడుతున్నాయి. పొగ తాగడాన్ని క్రమంగా తగ్గించడంతో ఫలితంగా సత్వరమే బీపీ, ఊపిరితిత్తులు, గుండె స్పందనలు మెరుగవుతాయి. పొగమానేస్తే శరీరంలో ప్రమాదకర కార్బన్ మోనాక్సైడ్ పరిమాణం తగ్గుతూ ఆరోగ్య పునరుద్ధరణకు బాటలు పడతాయి. సిగరెట్లు కాల్చడంతో వేల సంఖ్యలో రసాయనాలు విడుదల అయినప్పటికీ అందులో 70 వరకు ప్రమాదకర రసాయనాలు (కర్బన రసాయనాలు, క్యాన్సర్ కారకాలు, లోహాలు, వాయువులు, నికోటిన్, తార్‌లాంటివి) ప్రాణాంతకమైనవి ఉన్నట్లు గుర్తించారు. పొగ తాగడమనే దురలవాటు తీవ్ర ప్రభావాలను దృష్టిలో పెట్టుకొన్న ప్రపంచ పౌర సమాజం 1984 నుంచి ప్రతి ఏటా 2వ బుధవారం రోజున విశ్వవ్యాప్తంగా నేషనల్ నో స్మోకింగ్ డే" పాటించడం కొనసాగుతున్నది. పొగను వదిలితే ఆరోగ్యం మెరుగవుతుందనే నినాదాన్ని క్రిందటి స్థాయివరకు ప్రచారం చేయడం నేటి అవసరంగా భావించాలి. ప్రత్యక్షంగా పొగ తాగడంతో పాటు పొగరాయుళ్లతో పాటు వారు వదిలే




పొగను పీల్చే సెకండ్ హాండ్ స్మోకర్స్ కూడా పొగ తాగినట్లుగా, అనారోగ్యం పాలు అవుతారని భావించాలి. పొగ తాగడం ప్రాణాంతకం కావడంతో బహిరంగ ప్రదేశాల్లో స్మోకింగ్ నిషేధం విధించబడడం సముచిత నిర్ణయంగా కొనియాడాలి. పొగ తాగడంవల్ల ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ సంభావ్యత పెరుగుతుందని పొగరాయుళ్లు గమనించాలి. పొగతాగడం వల్ల జీర్ణనాళం, మూత్రపిండాలు, కాలేయం, యూరినరీ బ్లాడర్ లాంటి ప్రధాన అవయవాలు కూడా దెబ్బతినడం ఖాయమని తేలింది. 2025 నేషనల్ నో స్మోకింగ్ డే ఇతివృత్తంగా అన్‌మాస్కింగ్ ది అప్పీల్" లేదా విజ్ఞప్తులను విందాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. పొగ తాగడమనే దురలవాటు వల్ల వ్యక్తి జీవితకాలం కనీసం 10ఏండ్లు తగ్గుతుందని తేలడం ప్రమాద హెచ్చరికగా భావించాలి. స్టైల్‌గా పొగ పీల్చడం వల్ల అనారోగ్యాలు, ఆర్థికభారం, ఆసుపత్రి బిల్లులు, సమాజంలో చెడ్డ పేరు, కుటుంబాల్లో చీకట్లతో పాటు చివరికి అకాలమరణం లాంటివి ఉచితంగా వస్తాయని పొగరాయుళ్లు బుద్ధి తెచ్చుకోవాలి. పొగ తాగడం వల్ల చికాకు లేదా ఇరిటేషన్, పొగపట్ల తీవ్రమైన కోరిక, చంచలత్వం, నిద్రలేమి లాంటి రోగ లక్షణాలు బయటపడడం, తర్వాత తీవ్రమైన ఊపిరితిత్తులు, హృద్రోగాలు,శ్వాసక్రియ రోగాలకు దారి తీస్తుంది. పొగకు స్వస్తిపలుకుదాం కొత్త జీవితాలను ప్రారంభిద్దాం" అంటూ శారీరక మానసిక ఆరోగ్యాలను ఆహ్వానిస్తూ, తన కోసమే కాదు తనను నమ్మిన వారి కోసం ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకుందాం. మన ప్రాణాలు తీయక ముందే మనమే పొగకు విడాకులిద్దాం. పొగకు లొంగకుండా మన జీవితాలను సుసంపన్నం చేసుకుందాం. పొగ దురలవాటు డబ్బుతో ముడిపడింది కాదని, కుటుంబ జీవితాలతో సంబంధాన్ని పెనవేసుకుందని తెలుసుకోవాలి. పొగను వదిలితే నీ ఆరోగ్యంతో పాటు పర్యావరణ ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని మరువరాదు. తమ బతుకుల్లో పొగసూరక ముందే బుద్ధి తెచ్చుకొని పొగకు 'నో' చెబుదాం, ఆరోగ్యకర జీవితానికి 'ఎస్' చెబుదాం. •

# బడ్జెట్లో విద్యారంగ కేటాయింపులు పెంచాలి

పాకాల శంకర్ గౌడ్

స్వాతంత్రం సిద్ధించి 78 సంవత్సరాలు గడిచినా, పాలకులు మారినా, స్వరాష్ట్రం సిద్ధించాక రాష్ట్రంలో నాణ్యమైన విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందించలేకపోతున్నాం. ఎన్నికలవేళ రాజకీయ పార్టీలు ప్రజలకు నాణ్యమైన విద్య,వైద్యం ఉచితంగా అందిస్తామని ఏళ్లుగాహామీలు ఇస్తూనే ఉన్నారు. మాటలకు చేతలకు పొంతన ఉండడం లేదు. నేటికీ నాణ్యమైన విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందడం లేదు. రాష్ట్రంలోని సాధారణ పౌరులు వారి సంపాదనలో దాదాపుగా 80శాతం విద్య,వైద్యానికే ఖర్చు చేస్తున్నారనీ ఒక అంచనా. భారతదేశంలో అత్యధికంగా విద్య,వైద్య రంగాల్లో దోపిడీ జరుగుతుంది మన తెలుగు రాష్ట్రాల్లోనే. ప్రైవేటురంగంలో ఫీజులను నియంత్రించలేకపోవడం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణపై పాలకులకు చిత్తశుద్ధి లోపించడమే ఈ దుస్థితికి కారణం. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక సామాజిక బాధ్యతగా, విద్యావంతులు, మేధావులు, ఉపాధ్యాయ సంఘాలు తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థ ఎలా ఉండాలో సూచిస్తూ ప్రతిపాదనలను నాటి ప్రభుత్వానికి సమర్పించారు. వాటిని ఆనాటి ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. కేవలం గురుకుల విద్యావ్యవస్థను మాత్రమే ప్రోత్సహిస్తూ వచ్చింది. ఫలితంగా అప్పటికే కొనసాగుతున్న పాఠశాల విద్య నిర్లక్ష్యానికి గురైంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో కేజీ నుండి పీజీ వరకు ఉచితవిద్య అందిస్తామని, కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ బడుల్లో అందరికీ నాణ్యమైన విద్యను అందిస్తామని, పది సంవత్సరాలు అధికారంలో ఉన్నకాలంలో గత ప్రభుత్వం పాఠశాల విద్యకు కేటాయించిన బడ్జెట్ రాష్ట్రబడ్జెట్లో సగటుగా 6.6శాతం మాత్రమే. ఫలితంగా రాష్ట్రంలోని పాఠశాలల్లో 5895 పాఠశాలలో ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడుస్తున్నాయి. 2097 పాఠశాలల్లో అసలు పిల్లలే లేరు(జీరో స్కూల్స్). విద్యా హక్కు చట్టం అమల్లోకి వచ్చి 15 సంవత్సరాలు కావస్తున్న రాష్ట్రబడుల్లో మూత్రశాలలు బాలురకు 74.1 శాతం, బాలికలకి 85.14శాతం మాత్రమే ఉపయోగించే స్థితిలో ఉన్నాయి. రాష్ట్రంలో ప్రతిఏటా జీరోబడులు(పిల్లలు లేని బడులు )పెరుగుతున్నాయి. ప్రభుత్వ బడులకుఆదరణ తగ్గుతుందనే విషయం మనకు అర్థం అవుతుంది. కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అన్నట్టుగా తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల విద్యారంగం గాడి తప్పడానికి గత దశాబ్ద కాలంలో కేవలం గురుకులాలను ప్రోత్సహిస్తూ మిగతా బడులను నిర్లక్ష్యం చేయడం,మౌలిక సదుపాయాల కొరత, టీచర్ల కొరత, పర్యవేక్షణ లోపం, సత్ఫలితాలను ఇవ్వని పథకాల అమలు,ప్రభుత్వబడులపై తల్లిదండ్రులకు ఏర్పడిన



అభిప్రాయం,విద్యారంగానికి సరిపోయే బడ్జెట్ కేటాయించకపోవడం వంటివి ఉన్నాయి. తెలంగాణ బడ్జెట్‌లో విద్యారంగానికి గత సంవత్సరంలో 21,292(7.75శాతం) కోట్లు కేటాయించారు. దేశంలోని టాప్ 20 రాష్ట్రాలలో తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యల్పంగా 7.75శాతం నిధులను కేటాయించింది. ఢిల్లీ21.1శాతం,కర్ణాటక11శాతం, ఆంధ్రప్రదేశ్ (12.6శాతం), కేరళ(14శాతం), తమిళనాడు (14.1శాతం) రాష్ట్రాలు విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకి మనకన్నా అత్యధిక నిధులు కేటాయించాయి. ఆ రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ రాష్ట్ర విద్యారంగా కేటాయింపులు చాలా తక్కువ. నాటితో పోల్చుకుంటే నేటితరం ఉపాధ్యాయుల్లో సామాజికస్పృహ తగ్గిందని చెప్పవచ్చు. ప్రజా ఉద్యమాల్లో వీరి భాగస్వామ్యం కూడా తగ్గింది. ప్రగతిశీల చైతన్యపూరిత భావజాలానికి బదులుగా కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, స్వచింతన విద్యారంగంతో పాటు ఉపాధ్యాయుల్లో కూడా నెలకొన్నాయి. ప్రజలకు ఉపాధ్యాయులకు మధ్య అవినాభావ సంబంధం తగ్గింది. గతంతో పోలిస్తే నేటితరం ఉపాధ్యాయులపై ప్రజల్లో ప్రేమ అభిమానాలు,గౌరవం కూడా తగ్గాయి. వాటిని పునరుద్ధరించుకోవాల్సిన బాధ్యత నేటి తరం ఉపాధ్యాయుల పైన ఉంది. ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాల పెంపుకోసం ప్రతి సంవత్సరం వృత్యంతర శిక్షణలను ఇస్తూ, పర్యవేక్షణ అధికారులతో నిరంతరం పర్యవేక్షిస్తే సత్ఫలితాలు సాధించవచ్చు. పర్యవేక్షణ అధికారులుగా బోధనా అనుభవం లేనివారిని నియమిస్తే అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంటుంది. జిల్లా, మండలస్థాయి పర్యవేక్షణ అధికారులుగా బోధనాఅనుభవం గల వారిని మాత్రమే నియమించాలి. క్షేత్రస్థాయి పరిస్థితుల్ని విద్యార్థుల ఉపాధ్యాయుల సమస్యలను అర్థంచేసుకోవాలంటే బోధనాఅనుభవం ఉన్న అధికారులతో మాత్రమే సాధ్యమవుతుంది. విద్యకు 15శాతం నిధులు బడ్జెట్‌లో కేటాయించి, ప్రభుత్వబడులను పటిష్టంచేసి రాష్ట్రంలోని బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు కేవలం 7.75శాతం మాత్రమే గతబడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. దేశంలోని అన్నిరాష్ట్రాల్లో విద్యకుకేటాయించిన సగటుబడ్జెట్ 14.7శాతంలో ఈకేటాయింపులు సగంమాత్రమే అని గమనించాలి. విద్యారంగాన్ని సంక్షోభం నుండి బయట పడేయాలంటే రాష్ట్రంలో వివిధ మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న 30306 పాఠశాలలో చదువుతున్న 28,95,456 మంది విద్యార్థులు 2020 సంక్షేమహాస్టల్లో ఉండి చదువుకుంటున్న 3,30,000 మంది ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులు 35000 అంగన్వాడీ సెంటర్లో ఉన్న మూడు లక్షల పూర్వ ప్రాథమిక విద్యార్థుల అవసరాలను పరిగణలోకి తీసుకోవాలి. రాబోయే రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి నిధులు కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉంది. •




కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

# అభివృద్ధి దిశగా దత్తత గ్రామం కొండపర్తి

## రోల్ మోడల్‌గా నిలవాలి: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

### మహిళల ఆర్థికాభివృద్ధికి చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు

**ములుగు, ప్రభాతవార్త:** దేశానికి రోల్ మోడల్ గా కొండపర్తి గ్రామం నిలవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ఎస్ ఎస్ తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో రాష్ట్ర గవర్నర్ పర్యటించారు. తొలుత కొమరం భీం, బిర్సా ముండ విగ్రహాలను, పాఠశాలలో డిజిటల్ తరగతులను, అంగన్వాడీ కేంద్రాన్ని, రూ.7,84,700 ల వ్యయంతో నిర్మించిన మసాలా యూనిట్, రూ.7,76,594 వ్యయంతో కుట్టు మిషన్ యూనిట్ ను ప్రారంభించారు. అనంతరం రిమోట్ తో వ్యవసాయ మోటార్లు ప్రారంభించారు.

**రోల్ మోడల్‌గా కొండపర్తి గ్రామం**

గవర్నర్ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. ఈ గ్రామంలో 70 గృహాలు 285 మంది ప్రజలు ఉన్నారని, చిన్న గ్రామమని అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి మన సేవలు ఎంతో అవసరం అని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో డిజిటల్ తరగతులు ప్రారంభించుకోవడం ఎంతో సంతోషమని ఆయన అన్నారు. విద్యార్థులు ఇంగ్లీషు బాగా మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. కొండపర్తి గ్రామంలో మహిళల ఆర్థికాభివృద్ధికి చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు ఆవశ్యకత ఉందని తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్ల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధన జరుగుతుందని తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలో అమూల్ ఏవిధంగా ప్రసిద్ధిగాంచిందో అదే తరహాలో కొండపర్తి గ్రామం కారం, పసుపు, మసాలా, యూనిట్లకు అంతటి పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రాంతంలో మిర్చి సాగు బాగుందని, ఇక్కడ తయారయ్యే కారానికి మంచి రావాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఇక్కడ తయారైన కారానికి బాగా మంచి గుర్తింపు రావాలని ఆయన సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ సంకల్పానికి ఈ గ్రామం ఆదర్శంగా నిలవాలని పిలుపు పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతమైన కొండపర్తి గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నానని, ఈ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తయారు చేయుటకు ఆదివాసి మారుమూల గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. తాను రాష్ట్రంలో ఏడు ఆదివాసి గ్రామాలను దత్తత తీసుకున్నానని అన్ని గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుటకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో కోటి 50 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఆదివాసీల అభివృద్ధికి తాను, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటు ద్వారా ఆదాయం సమకూరుతుందని తద్వారా ఆదివాసులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. తాను, రాష్ట్రపతి, రాష్ట్ర మంత్రి సీతక్క అందరూ ఆదివాసి బిడ్డలమని ఆయన పేర్కొన్నారు. దేశానికి కొండపర్తి గ్రామం మోడల్ గా కావాలని పేర్కొన్నారు. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ శబరీష్, గ్రామస్తులు తదితరులు గవర్నర్ ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించారు.




సమావేశంలో మాట్లాడుతున్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

# రోడ్డుప్రమాదాల్లో మరణాలు తగ్గించేలా పనిచేయాలి

### రవాణా శాఖకు మంచి పేరు తీసుకురావాలి

### ఎంవిఐల శిక్షణ తరగతుల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

### జూలై 9 వరకు కొనసాగనున్న శిక్షణ

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా నియమితులైన అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్(ఏఎంవిఐ)లు రోడ్డు ప్రమాదాల్లో మరణాలు తగ్గించేలా పనిచేయాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కొత్తగా నియమితులైన ఏఎంవిఐలు రవాణా శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కొత్తగా నియమితులైన ఏఎంవిఐలకు మంగళవారం నుంచి హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ తరగతులను మంత్రి పొన్నం ప్రారంభించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో జూలై 9 వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, తెలంగాణ పోలీస్ అకాడమీ డెరెక్టర్ శ్రీనివాస్ రావు, డిప్యూటీ డెరైక్టర్ నర్మదా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నూతనంగా ఎంపికై నియామకాలు పొంది రవాణా శాఖకు గొప్ప పేరు తేవాలని .. శిక్షణ పొందడానికి వచ్చిన ఏఎంవిఐలకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో సమర్థవంతంగా పనిచేసి రవాణా శాఖకి పేరు తేవడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. గతంలో నెల రోజుల పాటు శిక్షణ ఉండేదని.. ఇప్పుడు 4 నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఫీల్డ్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా పని చేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని.. రవాణా శాఖ గౌరవాన్ని కాపాడుతుందన్నారు. ఉద్యోగం పొందినప్పుడు ఎలా ఉంటారో ..దానినే ఎప్పటికీ కంటిన్యూ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు తగ్గించేలా పని చేయాలని మంత్రి పొన్నం సూచించారు. ఫిట్‌నెస్ ఉందా? లేదా? డ్రైవింగ్ లైసెన్స్ ఇస్తున్నమా? లేదా? అనే విధంగా పని చేయవద్దన్నారు. శిక్షణ ద్వారా ప్రేమ ఆప్యాయత, కాఠిన్యత ఉండాలన్నారు. రవాణా శాఖ మంచి పేరు తీసుకురావాలని.. రవాణా శాఖకి మొదటిసారి లోగో తయారు చేశామన్నారు. మీకు కూడా వాహనాలు వస్తున్నాయని.. దానిపై డిపార్ట్‌మెంట్ లోగో ఉంటుందన్నారు.

# డ్రగ్స్, గంజాయి నిర్మూలనమే ఏకైక లక్ష్యంగా పనిచేయాలి

### ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త :** ఎక్సైజ్ శాఖలో పనిచేసి యంత్రాంగం రెవెన్యూ టార్గెట్లను పూర్తి చేస్తూ.. డ్రగ్స్, గంజాయి, నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్, నాటుసారాను నిర్మూలన కోసం నిరంతరం కృషి చేయాలని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ డెరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి అన్నారు. అబ్కారీ భవన్‌లో మంగళవారం తెలంగాణలోని వివిధ భాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఆయన క్యాష్ రివార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖ బాగా పనిచేయడానికి, గంజాయి.డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కేసుల నమోదు, నేరాలకు పాల్పడుతున్న వారికి శిక్షణపడేలా కేసులను తయారీ చేయాలన్నారు. అంతకు ముందు ఆయన 14 కేసుల్లో శిక్షలు పడే విధంగా చొరవ తీసుకున్న 15 మందికి, డ్రగ్స్,గంజాయిని పట్టుకున్న 33మందికి క్యాష్ రివార్డులతో పాటు,మెదక్ సంగారెడ్డిలో 200 కేజీల గంజాయిని పట్టుకున్న 12మందికి ప్రశంస పత్రాలతోపాటు క్యాష్ రివార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, మెదక్, రంగారెడ్డి, వరంగల్, నల్లగొండ డిప్యూటీ కమిషనర్లు జె.హరి కిషన్, పి.దశరథ్, జి.అంజన్‌రావు, ఎ.శ్రీనివాసరెడ్డి ఎన్‌ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి,రంగారెడ్డి, ఖమ్మం, మెదక్ జిల్లా అసి స్టెంట్ కమిషనర్లు ఆర్.కిషన్, జి.గణేష్, జి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం, సంగారెడ్డి, సిద్దిపేట డిసిఇఐలు నరేందర్‌రెడ్డి, ఎస్.నవీన్‌చంద్ర, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

# యాంత్రీకరణలో చిన్న రైతులకు ప్రాధాన్యత

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా చిన్న, సన్నకారు రైతులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ నుండి మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయంలో ఉపయోగించే పవర్ టిల్లర్స్, పవర్ వీడర్, రోటోవేటర్ మరియు ట్రాక్టర్ తో నడిపే పరికరాలు, తైవాన్ స్ప్రేయర్స్ మొదలైన పనిముట్లను సబ్సిడి మీద అందించుటకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో సీడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.90 కోట్లు నష్టం వచ్చిందని తెలిపారు. సీడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా నాణ్యమైన సన్నరకాల విత్తనాలను రైతులకు అందించేందుకు తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే కందులు, మినుములు, సన్ ఫ్లవర్, శనగలు మొదలైన పంటల విషయంలో నాణ్యమైన విత్తనాలను సీడ్ కార్పొరేషన్ ద్వారా అందించాలన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా నిర్వహించబడుతున్న జిన్నింగ్ మిల్లు గత నాలుగేళ్లగా ఉపయోగంలో లేదని, ఈ సంవత్సరం దాని జిన్నింగ్ పనిని ఆరంభించ మన్నారు. మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఉన్న గోదా ములు 100 శాతం పూర్తిస్థాయిలో వినియోగంలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కందులు, శనగలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు మొదలైన పంటల కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాగా స్వల్పకాలిక రకా లను నవంబర్ లోనే సాగును ప్రారంభిం చినట్ల యితే మార్చి మొదటి వారం వరకు వరి కోతకు రావడానికి అవకాశం ఉంటుందని గ్రహించి రైతులు ముందస్తు ప్రణాళికతో సాగుచేయాల్సి న అవసరం ఉందన్నారు.

# ప్రతి కార్యకర్తకు అండగా నిలబడదాం



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

### గ్రామస్థాయిలో నాయకులుగా తయారుచేద్దాం

### పెండింగ్ పనుల వివరాలు తీసుకురండి

### పార్టీ ముఖ్యనేతల సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ దిశానిర్దేశం

**పటాన్‌చెరు, మార్చి 11, ప్రభాతవార్త:** కార్యకర్తలే పార్టీకి బలమని ప్రతి నాయకుడు కార్యకర్తలకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మం త్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. మంగళ వారం హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమా వేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మె ల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, సీనియర్ నాయ కులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు మంత్రులు స్థానికసంస్థల ఎన్నికల్లో అనుసరిం చాల్సి న వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం విరివిగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న విషయాన్ని క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సూచిం చారు. గ్రామ స్థాయిలో ప్రతివాడలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులకు సం బంధించిన వివరాలను సేకరించి తీసుకురావాలని కోరారు. అసెంబ్లీ పూర్వపుగానే ఎస్డీఎఫ్ నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాల పను లను కార్యకర్తలకే కేటాయించేలా ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్ చార్జిలు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని ప్రతినేత కార్యకర్తకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో తోడుండాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు అవకాశాలు కల్పించి వారిని నాయకులుగా తయారుచేయాల్సి న బాధ్యత మనపైనే ఉందన్నారు.



రాష్ట్ర బడ్జెట్‌పై జరిగిన బిసి ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

# బిసి సంక్షేమానికి రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

### సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** వచ్చే బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరంకు బీసీ బడ్జెటు రూ.20వేల కోట్లకు పెంచాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు రూ.38 వేల కోట్ల బడ్జెట్ కేటాయించారని ఆయన పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం రూ.4వేల కోట్లు ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు, బీసీ కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తి ప్రకారం ఒక్కొక్క ఫెడరేషన్లకు రూ.2వేల కోట్లు చొప్పున కేటాయించాలన్నారు. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిగ్రీ, ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీమును కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టో ప్రకారం పునరుద్ధరించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఇస్తున్న మాదిరిగా బీసీ విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదనంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక బీసీ గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో నిధులను కేటాయించడంలో బీసీను నిర్లక్ష్యం చేస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీసీలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# స్కాలర్‌షిప్ బకాయిలు 20వ తేదీలోగా చెల్లించకపోతే సెమిస్టర్ పరీక్షల బహిష్కరణ

### ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రికి ప్రైవేటు డిగ్రీ, పిజి కాలేజీల యాజమాన్యాల లేఖలు

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న డిగ్రీ, పీజీ విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ పీజీ, డిగ్రీ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టిపిడిఎంఏ) డిమాండ్ చేసింది. ఈ నెల 20లోపుగా బకాయిలను చెల్లించకపోతే సెమిస్టర్ పరీక్షలను నిర్వహించకుండా బైకాట్ చేస్తామని అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి లేఖ రాసినట్టు అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి యాద రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్స్ పరమేశ్వర్, శ్రీధర్‌రావ్ కోశాధికారి శంకర్‌లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలుగా 16 నెలలుగా తమరికి విన్నవిస్తూ.... మా ఆర్థిక ఇబ్బందులను మీరు చెల్లించవలసిన ఆర్‌టిఎఫ్‌లను చెల్లించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి మూడు పర్యాయాలు సమావేశం నిర్వహించి, ఫీజు బకాయిలను విడుదల చేపిస్తానని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆందోళన విరమింప చేసినట్టు తెలిపారు. కానీ ఇప్పటివరకు కనీసం 20 శాతం కూడా ఫీజు బకాయిలు విడుదల చేయలేదని.. కొన్ని కాలేజీలకైతే వన్ పర్సెంట్ కూడా విడుదల చేయలేదన్నారు.

తాము ఆర్థిక భారంతో అప్పుల బాధతో కళాశాలలు నిర్వహించలేని పరిస్థితుల్లో ఎంతో ఆందోళనకు గురవుతున్నట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల యాజమాన్యాలందరూ కేవలం ప్రభుత్వం చెల్లించే ఫీజు బకాయిలపైనే ఆధారపడి ఉండడం వలన, అవి రాక పోవడంతో వేదన భరించలేక ఈ నెల 20 లోపల ప్రభుత్వము ఫీజు బకాయిలైన సుమారు రూ. 2500 కోట్లు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఒకవేళ అలా జరగని పక్షంలో రాబోవు 2వ, 4వ, 6వ సెమిస్టర్ల రెగ్యులర్ ఎగ్జామ్స్‌ను నిర్వహించలేమని స్పష్టం చేశారు. కాబట్టి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని.. తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ నెల 20 లోపు ఫీజు బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజు బకాయిలు రానిపక్షంలో.... రాబోయే రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించలేమని తెలుపుటకు చింతిస్తున్నామని తెలిపారు.

# విమానాశ్రయం ద్వారా రామగుండంలో వ్యాపార, పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం

### విమానాశ్రయం స్థాపనపై కేంద్ర మంత్రితో కీలక చర్చ

**గోదావరిఖని, ప్రభాతవార్త:** పరిశ్రమల హబ్‌గా ఎదుగుతున్న రామగుండంలో విమానాశ్రయం ద్వారా వ్యాపార, పరిశ్రమల వృద్ధికి ప్రోత్సాహం లభిస్తుందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రాంమోహన్ నాయుడుకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వివరించారు.

కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడును న్యూఢిల్లీలో వారు కలిసి రామగుండం విమానాశ్రయం ప్రతిపాదనను ప్రస్తావించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, పెట్టుబడులు ఆకర్షించడానికి విమానాశ్రయం కీలకం, రామగుండంలో తాజా అధ్యయనం చేపట్టాలని కోరారు.

తద్వారా సాధ్యాసాధ్యాలపై స్పష్టత వస్తుందని వివరించారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, విమానాశ్రయం స్థాపనకు సాధ్యాసాధ్యాలపై త్వరలో అధ్యయనం ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ బృందాన్ని పంపించి సమగ్ర పరిశీలన చేయనున్నట్లు వారు వెల్లడిరచారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ రామగుండంలో విమానాశ్రయం సాధ్యమయ్యేలా అన్ని కార్యాచరణలు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర స్థాయిలో అవసరమైన మద్దతును ప్రభుత్వం నుంచి అందించేందుకు మంత్రి వెంకటరెడ్డి కూడా ధృఢ సంకల్పంతో ఉన్నారని తెలిపారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 337

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 11, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 337 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 60 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 43, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 39, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 129 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 66 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా. జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు తెలుసుకుని సంబంధిత శాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను వెంటనే పరిష్కరించారు.

# డంపింగ్ ఏరియాలో నవజాత శిశువు మృతదేహం

**యాదగిరిగుట్ట, మార్చి 11, ప్రభాతవార్త:** యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో డంపింగ్ ఏరియాలో నవజాత శిశువు ఆడపిల్ల మృతదేహం లభ్యమైంది. యాదగిరిగుట్ట సిఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరి పల్లి పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో డంపింగ్ ఏరియాలో నవజాత శిశువు సుమారు రోజు నిండిన ఆడపిల్ల మృతదేహం గుర్తించినట్లుగా తెలిపారు మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని తెలిపారు. సమీపంలో ఉన్న ఆస్పత్రులలో విచారించి ఈ సంఘటన కారణమైన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ప్రతినెల చివరి వారంలో సివిల్ రైట్స్‌డే నిర్వహించాలి

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**నల్గొండ ప్రతినిధి, ప్రభాతవార్త, మార్చి 11:** ఒకరోజు నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధ్యక్షతన కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్ ,కొంకతి లక్ష్మీ ,మ్మనారాయణ ,జిల్లా శంకర్ లు మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉదయాదిత్య భవన్లో షెడ్యూల్ కులాలు, తెగల వారిపై దాడులకు సంబంధించిన కేసులు, భూములకు సంబంధించిన సమస్యల పై సమీక్ష నిర్వహించారు. అంతేకాక షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికి సంబంధించిన సమస్యలపై ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపిన వివరాలను సావధానంగా విన్నారు. దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ఎస్సీ, ఎస్టీల భూములకు సంబంధించి (9) కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ కేసులకు సంబంధించి మార్చి 31లోగా నివేదికలు పంపించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఆదేశించారు. అలాగే జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి(17)కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వీటికి సంబంధించిన నివేదికలు పంపించాలని కోరగా, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ 12 కేసులకు ఇదివరకు నివేదికలు పంపించామని, 5 కేసులకు సంబంధించి నివేదికలు పెండింగ్‌లో ఉన్నాయని, కమిషన్ ఆదేశాల మేరకు నిర్దేశించిన సమయంలో నివేదికలు పంపిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే పరిహారం విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జిల్లాలో కొన్ని ప్రాంతాలలో దేవాలయ ప్రవేశం, అంటరానితనం, ఎస్సీ, ఎస్టీలపై దాడుల వంటి తమ దృష్టికి వచ్చాయని, వీటన్నిటి నివారణకు ప్రతి నెల చివరన గ్రామాలలో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ఏ నెలలో, ఏ గ్రామంలో సివిల్



రైట్స్‌డే చేసే విషయాలను స్పష్టంగా తెలియజేయాలని, గ్రామం మధ్యలో నిర్వహించి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే జిల్లా స్థాయి ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నిర్వహించే విషయాన్ని వారం రోజులముందే కమిషన్ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే తాను కానీ, లేదా సభ్యులు కానీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల సమావేశాలకు హాజరవుతామని స్పష్టం చేశారు. సమావేశం ప్రారంభమైన వెంటనే జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించిన కేసుల వివరాలను కూలంకషంగా వివరించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్రపవర్ ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించిన వివరాలను తెలియజేసారు. ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, ఇన్‌చార్జి డిఆర్‌ఓ అశోక్‌రెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ ఎసిపి మోనిక, ఆర్డీవోలు, డిఎస్పీలు, జిల్లా అధికారులు , ఎస్సీ ఎస్టీ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్ సంబంధించిన అఖిల తదితరులు హాజరయ్యారు. ఆనంతరం ప్రణయ్ హత్య కేసులో వాదనలను వినిపించి దోషులకు పడేలా చేసిన అడ్వకేట్ దర్శనం నర్సింహను ఈ సందర్భంగా చైర్మన్,సభ్యులు,జిల్లా కలెక్టర్,ఎస్ పిలను సన్మానించారు.

# ఎసిబికి చిక్కిన మున్సిపల్ ఆర్‌ఐ

### మ్యూటేషన్ కోసం రూ.12 వేలు తీసుకుంటూ చిక్కిన వైనం



ఎసిబికి చిక్కిన మున్సిపల్ ఆర్‌ఐ జానయ్య

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 11, ప్రభాతవార్త:** ఇంటి స్థలం మ్యుటేషన్‌కు లంచం డిమాండ్ చేసి బాధితుడి వద్ద నుంచి రూ.12 వేలు లంచం తీసుకుంటూ మెదక్ మున్సి పల్ రెవెన్యూ అధికారి ఏసీబీకి చిక్కిన ఘటన మంగళవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మెదక్ పట్టణానికి చెందిన శైలజకు సర్వే నెంబర్ 505/1/2లో 605 గజాల ఇంటి స్థలం ఉంది. భూమి మ్యుటేషన్ కోసం గత నెలలో దరఖాస్తు చేసుకున్నారు. కానీ మ్యుటేషన్ కోసం మున్సి పల్ అర్‌ఐ జానయ్యను సంప్రదించగా పని చేయలేదు. దీనితో పలుమార్లు అతని వద్దకు వెళ్లినా ప్రయోజనం కలగలేదు. దీంతో విషయం సోదరుడు ధర్మకారి శివకుమార్‌కు చెప్పడంతో మున్సి పల్ అర్‌ఐ వద్దకు వెళ్లి మ్యుటేషన్ చేయాలని కోరగా అందుకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఇందుకు రూ.12 వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు జానయ్యకు రూ.12 వేలు లంచం ఇవ్వగా అక్కడే కాపు కాసి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకొని అర్‌ఐ లంచంగా తీసుకొన్న డబ్బులను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

**లంచం అడిగితే సమాచారం ఇవ్వండి: ఎసిబి డిఎస్పీ సుదర్శన్**

ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ఏసీబీకి సమాచారం ఇవ్వాలని ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. జిల్లాల్లో ఎక్కడ ఏ ప్రభుత్వ అధికారైన లంచం అడిగితే 9440446106 నెంబర్‌లో తమకు ఫిర్యాదు చేయాలని కోరారు.

## ఖర్గే వ్యాఖ్యలతో ఎగువసభలో దుమారం

### ఛైర్మన్‌కు క్షమాపణలు చెప్పిన ఖర్గే



**న్యూఢిల్లీ, మార్చి 11:** విద్యాశాఖమంత్రిపై చర్చ సందర్భంగా రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గేచేసిన వ్యాఖ్యలతో సభ దద్దరిల్లింది. కాంగ్రెస్ అధ్యక్షుడు అభ్యంతరకర వ్యాఖ్యలుచేసారని బిజెపి మండి పడింది. దీనిపై స్పష్టత ఇచ్చిన ఖర్గే క్షమాపణలు చెప్పారు. తానుచేసిన వ్యాఖ్యలు డిప్యూటీ ఛైర్మన్‌ను ఉద్దేశించింది కావని కేవలం ప్రభుత్వంపైనే విమర్శలుచేసానని చెప్పారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయం అనంతరం విద్యాశాఖ పని తీరుపై చర్చను ప్రారంభించారు. కాంగ్రెస్ సభ్యుడు దిగ్విజయసింగ్‌ను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సూచించారు. ఇదే సమయంలో తమిళనాడు ప్రభుత్వంపై కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ వ్యాఖ్యలకుగాను ఆయన క్షమాపణ చెప్పాలని డిఎంకె ఎంపిలు డిమాండ్ చేసారు. ఈ గందరగోళం మధ్య జోక్యంచేసుకున్న ఖర్గే ఉదయం తాను మాట్లాడేటప్పుడు విద్యాశాఖ మంత్రి సభలో లేరని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహారిస్తోందని, ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేందుకు విపక్షాలు సిద్ధంగా ఉన్నాయన్న అర్థం వచ్చేలా ఒక హిందీపదం వాడారు. దీనిపై అధికారపక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ప్రతిపక్ష నేత వాడిన పదజాలం ఖండించదగినదని దుయ్యబట్టింది. ఛైర్‌ను ఉద్దేశిస్తూ అటువంటి వ్యాఖ్యలు క్షమించరానిదని రాజ్యసభా పక్షనేత జెపి నడ్డా మండిపడ్డారు. స్పందించిన ఖర్గే ఆపదజాలం వాడినందుకు క్షమాప ణలు చెపుతున్నానన్నారు.

## మామిడికి వైరస్.. రాలిపోతున్న పూత

### దిగుబడిపై ప్రభావం

### ఆందోళనలో రైతాంగం

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** వాతావరణంలో వచ్చిన మార్పులు మామిడి రైతులకు శాపంగా మారాయి. పొగ మంచు, ఉష్ణోగ్రతల మార్పులతో మామిడి చెట్లుకు పూత రావడం లేదు. కొన్నింటి పూత వచ్చినప్పటికీ ఎక్కువ భాగం రాలిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా తెలంగాణలో మామిడి తోటలకు వైరస్ వ్యాపించింది. దీంతో మామిడి చెట్లపై పూత లేకపోవడం, కాస్తో కూస్తో ఉన్న పూత రాలిపోతోంది. ప్రస్తుత వాతావరణ ప్రభావం, మంచు కారణంగా ఇప్పటికే మామిడి తోటలకు 15 శాతం కూడా పూత రాలేదు. దీనికితోడు మామిడి చెట్లకు తామర పురుగు వైరస్ వ్యాపించడంతో పూత రావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా అంతంత మాత్రంగా ఉన్న పూత కూడా రాలిపోతుందని చెబుతున్నారు. అంతేకాకుండా నెల రోజులుగా రాత్రి పూట ఉష్ణోగ్రత సాధారణం కన్నా దాదాపు ఏడు డిగ్రీల వరకూ నమోదు కావడం, ఉదయం పూట పొగ మంచు విపరీతంగా కురుస్తున్నందున మామిడి పూతపై నలుపు రంగు మచ్చలు సైతం ఏర్పడుతున్నాయి. మిరప రైతులను నట్టేట ముంచిన తామర పురుగు ఇప్పుడు మామిడి తోటలకు వ్యాపించడంతో పెద్ద ఎత్తున పెట్టుబడులను నష్టపోయే అవకాశాలు ఉన్నాయని పలువురు రైతులు కన్నీటి పర్యాంతమవుతున్నారు. ఈ వైరస్ వ్యాపించడంతో మామిడి చెట్లకు పూత నిలవక పిందెలు కాక దిగుబడి భారీగా తగ్గుతుందని చెబుతున్నారు. సాధారణంగా మామిడి చెట్లకు డిసెంబర్ నెలలో పూత మొదలవుతుంది. అయితే ఆలస్యంగా ఈ నెలలో పూత రావడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరు నాటికి పూతతో మామిడి తోటలు కళకళలాడాల్సిన సుండగా, తామర పురుగుతో పూత రాలిపోతోంది. మరోపక్క మామిడికి ఇప్పటికే పలు ప్రాంతాల్లో తేనె మంచు పురుగు ఆశించి నల్ల మచ్చలు ఏర్పడి కాయ నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. రాష్ట్రం మొత్తం మీద 3.20 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. తద్వారా ఎకరానికి 4 వేల టన్నుల చొప్పున 12,70,364 టన్నుల మేర దిగుబడి వస్తోంది. మామిడిలో ప్రధానంగా బంగినపల్లి, చిన్న రసాలు, తోతాపురి, తెల్ల గులాబీ, పెద్ద రసాలు, సువర్ణరేఖ తదితర రకాలు ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా జగిత్యాల జిల్లాలో 34 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా, ఖమ్మం జిల్లాలో 33,800 ఎకరాలు, నాగర్‌కర్నూల్‌లో 25,931 ఎకరాలు, రంగారెడ్డిలో 22,583 ఎకరాలు, మంచిర్యాలలో 18 వేల ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 15,863 ఎకరాల మేర తోటలు ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లో అంతంత మాత్రంగానే మామిడి తోటలు ఉన్నాయి. కాగా పలువురు రైతులు మామిడి తోటలను కౌలుకు తీసుకున్నారు. తోట వయసును బట్టి ఇసుక నేలల్లో ఎకరా 30 వేల రూపాయల నుండి 40 వేల రూపాయల వరకూ, ఎర్ర నేలల్లోని తోటలను ఎకరానికి 15 నుండి 25 వేల రూపాయల వరకూ పలువురు కౌలుకు తీసుకున్నారు. ఈ ఏడాది మామిడి కాయలకు మంచి గిరాకీ ఉంటుందని రైతులు భావించారు. దీంతో ఎక్కువ ధరలకు తోటలు కొనుగోలు చేశారు. ఇసుక నేల ప్రాంతాల్లో ఎకరా 35 వేల రూపాయల నుండి 60 వేల రూపాయల వరకూ కొందరు కొనుగోలు చేశారు. అయితే వాతావరణ మార్పులు, వైరస్ వ్యాపించడం తదితర కారణాలతో పూత రాక, వచ్చింది నిలవక రాలిపోతుండడంతో ఏమి చేయాలో అర్థం కాక రైతులు, ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది.

## తిరుమలేశుడి దర్శనం కోసం

## మా ఎమ్మెల్యే, ఎంపిల లేఖలను అనుమతించండి

### ఏపి సిఎం చంద్రబాబుకు తెలంగాణ మంత్రి కొండా సురేఖ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి11:** ఇటీవల ఏపీ సర్కార్ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం తెలంగాణకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు తిరుపతి దేవుడి దర్శన కోసం ఇచ్చే సిఫారసు లేఖలను అనుమతించాలని మంత్రి కొండా సురేఖ కోరారు. ఈ మేరకు ఆమె ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రాబునాయుడుకు మంగళవారం లేఖ రాశారు. చంద్రబాబు నాయకత్వంలో తీసుకున్న ఈ మంచి నిర్ణయం తెలంగాణ ప్రజప్రతినిధులందరికీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి తిరుమలను సందర్శించే భక్తుల సంఖ్య ఈ మధ్య బాగా పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. అయితే,టిటిడి అధికారులు ఏపీ ముఖ్య మంత్రి ఆదేశాలను సరిగ్గా పట్టించుకోవడం లేదని నివేదించారు. టిటిడి అధికారులు తెలంగాణ భక్తులను అనుమతించకపోవడంపై తీవ్ర గందరగోళం నెలకొందని తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే ప్రత్యేకంగా పరిశీలించి, సదరు ఆదేశాలను సక్రమంగా పాటించేలా టీటీడీ అధికారులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## అధికార నివాసం వీడిన జస్టిన్ ట్రూడో

### వెళుతూ తన కుర్చీని పట్టుకెళ్లిన మాజీ ప్రధాని



**టొరంటో, మార్చి 11:** కెనడాప్రధాని జస్టిన్‌ట్రూడో బాధ్యతలనుంచి దిగి పోతున్నట్లుప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ప్రధానిగా మాజీ బ్యాంకర్ మార్క్ కార్నీని లిబరల్ పార్టీ ఇప్పటికే ఎన్ను కుంది. ట్రూడో పార్ల మెంటు నుంచి బ యటకు వస్తున్న సమయంలో ఒక కుర్చీచేత పట్టుకుని నాలుక బయటపెట్టి ఫోజులిచ్చిన ఫోటోలు సోషల్ మీడి యాలో వైరల్ అయ్యా యి. ఈనెల 9న జరిగిన ఎన్నికల్లో మార్క్ కార్నీని లిబరల్‌పార్టీ తమ సారథిగా ఎన్నుకుంది. దీనితో ఆయన కెనడా తదుపరి ప్రధానిగా త్వరలోబాధ్యతలుస్వీకరిస్తారు. అధికార మార్పిడిలోభాగంగా కార్నీతో జస్టిన్‌ట్రూడో భేటీ అయ్యారు. ఈ ప్రక్రియ సవ్యంగా అతిత్వరలోనే పూర్తికానున్నదని తెలిపిన ఆయన ప్రభుత్వం నుంచి పూర్తిగా వైదొలిగే ప్రక్రియ ప్రారంభించారు. ఈ క్రమంలో పార్లమెంటు భవనంనుంచి బయటకు వస్తూ తన కుర్చీని కూడా వెంట తీసుకువచ్చారు. ఈసన్నివేశం ఒక అంతర్జాతీయ మీడియా సంస్థ క్లిక్‌మని పించింది. కెనడాలో పార్లమెంటునుంచి వెళ్లిపోయే సమయంలో చట్టసభ సభ్యులు వారి కుర్చీలను వెంటతీసుకుపోయే సాంప్రదాయం ఉంది.

## జమ్మూ కాశ్మీర్‌లో మరో రెండు సంస్థలపై నిషేధం

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లో ప్రజాస్వామ్యం, పౌర హక్కుల పరిరక్షణ ముసుగులో పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థల సహకారంతో దేశ వ్యతి రేక కార్యకలాపాలకు పాల్పడుతున్న రెండు సంస్థలపై కేంద్ర హోం శాఖ ఐదేళ్ల పాటు నిషేధం విధించింది. ఈ మేరకు మంగళవారం ఆదేశాలు వెలువడ్డాయి. దీనిపై కేంద్ర హోం శాఖ అన్ని రాష్ట్రాలకు సమాచారం పంపడంతో పాటు ఈ సంస్థల కార్యకలాపాలపై నిఘా వుంచాలని ఆదేశించింది. అవామీ యాక్షన్ కమిటీ, జమ్మూ కాశ్మీర్ ఇత్తిహాదుల్ ముస్లిమిన్‌లపై ఈ నిషేధం కేంద్రం విధించింది, చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం 1967 ప్రకారం కేంద్ర హోం శాఖ ఈ నిషేధం విధించింది. ఈ రెండు సంస్థలు జమ్మూ కాశ్మీర్‌లో వేర్పాటు వాదాన్ని ప్రోత్సహించడంతో పాటు పాక్ ఉగ్రవాదులతో సంబంధాలు కలిగి వుండి, వారి అండదండలతో భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే వారికి అండగా వుండడంతోనే ఈ నిషేధం విధించినట్లు కేంద్ర హోం శాఖ పేర్కొంది. నిషేధం నేపథ్యంలో ఈ రెండు సంస్థల కార్యకలాపాలపై అన్ని రాష్ట్రాలు నిఘా వుంచాలని కేంద్ర హోం శాఖ ఆదేశాలు జారీ చేసింది.

## ఒకేరోజు ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మృతి

### రోడ్డు ప్రమాదంలో ఒకరు.. ఆత్మహత్య చేసుకొని మరొకరు

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), మార్చి 11, ప్రభాతవార్త:** సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే రోజు ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మ ృతిచెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. భార్యతో జరిగిన చిన్న గొడవకు మనస్థాపానికి గురైన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా, ద్విచక్రవాహనం మీద వెళ్తున్న మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో మ ృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యా లకు చెందిన సంగిరెడ్డి నర్సింహారెడ్డి(28)కి విష్ణుప్రియతో 2023లో వివాహమైంది. వీరికి ఆరు నెలల కుమారుడు ఉండగా, వీరు మియాపూర్ పరిధిలోని ఆద్విత నగర్ క్రిష్ణకాలనీలో నివాసం ఉంటున్నారు. నర్సింహారెడ్డి హైటెకెసిటీ పరిధిలోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా ఆదివారం మధ్యాహ్నం కుమారుడికి అన్నం తినిపించే విషయంలో భార్య, భర్తల మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో మనస్థాపానికి గురైన నర్సింహారెడ్డి బెడ్ రూమ్ లోపలికి వెళ్లి తలుపు వేసుకొని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



నర్సింహారెడ్డి(ఫైల్)

**రోడ్డు ప్రమాదంలో..**

మియాపూర్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మ ృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్ కడప జిల్లాకు చెందిన అమర్ భాషా కుమారుడు ఆర్.రోషన్(27) చందానగర్‌లో నివాసం ఉంటూ రోషన్ హైటెకెసిటీ పరిధిలోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి 11.40 గంటల ప్రాంతంలో బయటకు వెళ్తున్నానని తన రూమ్‌మేట్‌కు చెప్పి బయటకు వచ్చిన రోషన్ ద్విచక్రవాహనం మీద చందానగర్ నుంచి మియాపూర్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో మధీనగూడ దీప్తిశ్రీనగర్ కమాన్ వద్ద ముందున్న టిప్పర్ లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో రోషన్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి మరో ద్విచక్రవాహానాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోషన్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మ ృతి చెందాడు.

## బిసి స్టడీ సర్కిల్‌లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ

### నెల రోజులపాటు నాన్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ ప్రోగ్రాం

### బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బిసి స్టడీ సర్కిల్స్ లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ లో ఉచిత శిక్షణను ఇవ్వనున్నారు. నెల రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రైనింగ్ ప్రోగ్రాంను ఇవ్వనున్నట్టు బిసి స్టడి సర్కిల్ డైరక్టర్ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెఇపారు. శిక్షణ పూర్తైన తరువాత ప్రైవేట్ బ్యాంక్‌లలో ప్లేస్ మెంట్స్ కలుగుతాయన్నారు. ఉచిత శిక్షణ కార్యక్రమానికి బిసి విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఏప్రిల్ 12న ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఆన్ లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహించ నున్నట్టు తెలిపారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్, బిసి స్టడీ సర్కిల్ సంయుక్తంగా కలిసి నిర్వహిస్తున్న బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ లో నెల రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రైనింగ్ ప్రోగ్రాం ఇవ్వనున్నట్టు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శిక్షణ నెల రోజుల పాటు హైదరాబాద్‌లో స్కూల్ ఆఫ్ బిజినెస్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్స్యూట్‌లో ఇవ్వనున్నారు. ట్రైనింగ్ ప్రోగ్రాం పూర్తైన తరువాత ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తయి 26 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అభ్యర్థులు మార్చ్ 15 నుంచి ఏప్రిల్ 8 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచిం చారు. అర్హులైన బిసి విద్యార్థులకు.. ఏప్రిల్ 12న ఆన్లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌ను ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నారు. స్క్రీనింగ్ టెస్ట్ అనంతరం శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.5 లక్షలు కాగా పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల లోపు ఉండాలని పేర్కొ న్నారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. మరింత సమాచారం కొరకు 040 -29303130 నెంబర్‌లో సంప్రదించాలని డైరక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

## జోహాన్స్‌బర్గ్‌లో రోడ్డుపై తిరగబడిన బస్సు

### 12 మంది మృతి.. 30 మందికిపైగా గాయాలు

**జోహాన్స్‌బర్గ్ మార్చి 11:** దక్షిణాఫ్రికాలోని అత్యంత రద్దీనగరం జోహాన్స్‌బర్గ్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఒక బస్సు అదుపుతప్పి తిరగబడిపోవడంతో 12 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరికొందరికి తీవ్ర గాయాలు కావడంతో వారు సమీపంలోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. జోహాన్స్‌బర్గ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోనే అటుగా 50 మంది ప్రయాణీకులతో వస్తున్న బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తాపడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. బస్సులోనే ప్రయాణీకులు చిక్కుకోవడంతో సహాయక సిబ్బంది బస్సు శకలాలను వేరుచేసి వారిని బయటికి తీసారు. ప్రమాదానికి కల అసలు కారణం తెలియరాలేదు. స్థానికంగా అఖురేహులేని ప్రాంతపోలీసులు దర్యాప్తును ప్రారంభించారు. బస్సు వేగంగా వెళుతూ తాను రావాల్సిన రూటను కాకుండా మరోరూటుకు మళ్లిందని, దీనితో ఒక్కసారిగా వేగం అదుపుతప్పి బోల్తాపడిందని అంచనా వేస్తున్నారు. అయితే అసలు కారణం మాత్రం తెలియరాలేదు. మంగళవారం తెల్లవారుఝామున జరిగిన ఈ ప్రమాద సమాచారం తెలిసినవెంటనే గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించేందుకు సహాయక బృందాలు అక్కడకు చేరుకున్నాయి.

## గంజాయి డాన్ అంగూరు భాయ్‌పై పిడి యాక్ట్

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** రాష్ట్రం కాని రాష్ట్రం లోకి వచ్చి.. తెలంగాణలోని దూల్‌పేట స్థిరపడి గంజాయి డాన్‌గా ఎదిగిన అంగూర్ భాయ్ పై. ఎక్సైజ్ శాఖ సిఫారసు మేరకు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఐఎఎస్ అంగూరు పై మంగళవారం పీడీ యాక్ట్ ఆదేశాలను జారీ చేశారు. తనతో పాటు కుటుంబ సభ్యులు మొత్తంగా గంజాయి వ్యాపారంలో మునిగితేలిన ఈ కుటుంబం పై ఎన్ని మార్లు కేసులు పెట్టినా తిరిగి బెయిల్ పై వచ్చి గంజాయి వ్యాపారాన్ని కొనసాగిస్తూ ఉండడంతో ఇలాంటి క్రిమినల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి కమల్ హాసన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి, దూల్‌పేట ఎస్‌టిఎఫ్‌ఏ టీం లీడర్ అంజిరెడ్డి ప్రతిపాదించిన పీడీ యాక్ట్ ప్రతిపాదనలకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను చంచల్ గూడ జైల్లో ఉన్న అంగూర్ భాయ్‌కి దూల్పేట్ సిఐ మధుబాబు పిడియాక్ట్ ఉత్తర్వులను అందించారు.

## ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు అరెస్టు!

### ఐసిసి వారంట్లతో ఎయిర్‌పోర్టులోనే అదుపులోకి తీసుకున్న పోలీసులు

**మనీలా, మార్చి 11:** అంతర్జాతీయ నేరన్యాయస్థానం జారీచేసిన వారంట్లతో ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటెర్టోను పోలీసులు అరెస్టుచేసారు. ఆ దేశ రాజధాని మనీలాలో అంతర్జాతీయ విమానాశ్రయంలోనే ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. డ్యూటెర్టె హాంకాంగ్‌నుంచి స్వదేశానికి చేరుకోగానే అరెస్టుచేసారు. ఆయన చేపట్టిన మాదకద్రవ్యాలపై యుద్ధంలో వేలమంది మరణించారు. మానవ హక్కుల ఉల్లంఘటనలు చోటుచేసుకన్నాయన్న ఆరోపణలున్నాయి. ఇందుకు సంబంధించి అంతర్జాతీయ నేరన్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈకేసుపై గతంలోనే డ్యూటెర్టో స్పందిస్తూ ఐసిసి తన పై వారంట్ జారీచేస్తూ అరెస్టుకు సిద్ధంగా ఉండమని ప్రకటించింది. అదే క్రమంలో తాను మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని అణిచివేయడాన్ని కూడా సమర్థించుకున్నారు. డ్రగ్స్‌తో సంబంధం ఉన్నవారిని చంపేయమని తాను ఆదేశించినట్లు వస్తున్న ఆరోపణలను ఖండించారు. ఈ అరెస్టుపై ఆదేశ అధ్యక్ష కార్యాలయం స్పందిస్తూ ఇప్పటికే వారంట్‌కాపీని పోలీసులు డ్యూటెర్టోకు అంద చేసామని తెలిపారు. మాజీ అధ్యక్షుడు వారికస్టడీలోనే ఉన్నట్లు వెల్లడించింది. కాగామాజీ అధ్యక్షుడి తరపున న్యాయవాది సాల్వడోర్ పనేలో



మేయర్‌గా ఉన్న సమయంలో నగరంలోని నేరాలను అణచివేయడానికి తన అధీనంలో ఒక డెత్‌స్క్వాడ్ ఉండేదని, కొన్నాళ్లక్రితం రోడ్రిగో అంగీకరించారు.

## నిధులు సమకూర్చడం సవాల్ అని రేవంత్‌రెడ్డి చెప్పారన్న విపక్ష నేత!

### కర్ణాటక అసెంబ్లీలో గ్యారంటీలపై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 11:** గ్యారెంటీల అమలుకు నిధులు సమకూర్చడం ఎంత సవాలో ముఖ్యమంత్రి అయ్యాకే తెలిసొచ్చిందని మీ పార్టీకి చెందిన నేత, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారని కర్ణాటక బీజేపీ నేత ఆర్.అశోక్ తెలిపారు. కర్ణాటక అసెంబ్లీలో తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా విపక్ష నేత ఆర్.అశోక్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం రూ.18 వేల కోట్లు పెన్షన్లు, వేతనాలకు చెల్లిస్తూ, గ్యారెంటీల వ్యయాన్ని మోయటం భారమేనని పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించారని వ్యాఖ్యానించారు. కర్ణాటక ప్రభుత్వం తమ ఐదు గ్యారెంటీల అమలు కోసం సమితుల్లో కాంగ్రెస్ కార్యకర్తలను అధ్యక్షులుగా నియమించి వారికి కేబినెట్ హోదాను కల్పించింది. దీనిపై కర్ణాటక అసెంబ్లీలో బీజేపీ విమర్శలు గుప్పించింది. ప్రభుత్వ పథకాల అమలుకు స్థానిక ఎమ్మెల్యేలను నియమించకుండా, కాంగ్రెస్ పార్టీ సభ్యుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందని బీజేపీ సభ్యుడు కృష్ణప్ప ఆరోపించారు. ఈ నేపథ్యంలో విపక్ష నేత ఆర్. అశోక్ స్పందిస్తూ... తెలంగాణ గ్యారెంటీలపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. గ్యారెంటీలపై జాతీయస్థాయిలో చర్చ అవసరమని ఇటీవల ఓ మీడియా కాన్‌క్లేవ్‌లో రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారని గుర్తు చేశారు. గ్యారెంటీల అమలు కష్టమని రేవంత్ రెడ్డి చెబుతుంటే, రాష్ట్రంలోని (కర్ణాటక) మీ కార్యకర్తల కోసం గ్యారెంటీ అమలు పేరిట అయిదేళ్లలో రూ. 50 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు.

## గురుకులాల నిర్వహణ మహిళల చేతికే

### అధికారులతో సిఎస్ శాంతికుమారి చర్చోపచర్చలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 11:** తెలంగాణలోని చాలా గురుకులాల్లో కాంట్రాక్టర్లు కుళ్లిన కూరగాయలను సప్లయ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి.పాడైన ఆకు కూరలు, కూరగాయలతో వండి ఆహారాన్ని తిన్న గురుకుల విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో ఆ పరిస్థితిని చక్కదిద్దేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సరికొత్త నిర్ణయాన్ని తీసుకుంటోంది. కాంట్రాక్టర్ల విధానానికి స్వస్తి పలికి.. స్థానికంగా ఉన్న మహిళా సంఘాల ద్వారా కూరగాయలు, పప్పులు, ఇతర ఆహార పదార్థాలను సరఫరా చేయించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి కూడా కూరగాయలు, పండ్లు, పప్పుల సరఫరా బాధ్యతను మహిళా సంఘాలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచనగా ఉంది. జాతీయ పౌష్టికాహార సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఆహార పదార్థాలతో పాటు చిరుధాన్యాలకు ప్రాధాన్యమిస్తారు. సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ వికారాబాద్, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్‌గా పనిచేసినప్పుడు.. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలకు మహిళా సంఘాల ద్వారా చిరుధాన్యాల ఆహారాన్ని పంపిణీ చేయించారు.

ఇదే తరహాలో గురు కులాలు, వసతిగృహాలు, పాఠశాలలకు కూడా అందించేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో పండించే కందులు, వేరుశనగకు సరైన ధరలు రావడం లేదు.

కూరగాయలనూ రైతులు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోంది. వాటిని మహిళా సంఘాలు కొనుగోలు చేయడంతో రైతులకు కూడా గిట్టుబాటు ధరలు వచ్చే అవకాశం ఉంటుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. కాగా, రాష్ట్రంలోని గురుకులాలు, వసతిగృహాలు, పాఠశాలలు, వాటిలోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మహిళా సంఘాలను ఎంపిక చేసి, సరుకుల సరఫరా బాధ్యతలను అప్పగించేందుకు వీలుగా సెర్ప్ ప్రణాళిక రూపొందిస్తోందని సమాచారం. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఈ ప్రణాళిక ప్రకారం మహిళా సంఘాలతో గురుకులాలను నిర్వహింప చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఒకేసారి రాష్ట్రం అంతా ప్రారంభించాలా.. లేకుంటే దశలవారీగా చేపట్టాలా అనే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. ఈ కొత్త కార్యక్రమం రూపకల్పన కోసం త్వరలో సీఎస్ శాంతికుమారి అధ్యక్షతన సెర్ప్ సీఈవో, అన్ని గురుకుల విద్యాలయాల సంస్థలు, విద్యా శాఖ కార్యదర్శులతో సమావేశం జరగనుంది. దీనిపై మార్చి నెలాఖరులోగా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇవ్వడానికి సెర్ప్ కృషి చేస్తోంది. ఈ కార్యక్రమం అమలైతే అటు మహిళలకు, ఇటు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పరిశీలకులు అంటున్నారు.

## ఖమ్మంలో అవినీతి నిర్మూలన శాఖ కొరడా

### ఎక్సైజ్ శాఖ కార్యాలయంపై రెక్కీ

### రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సోమ్లా

**క్రైమ్ ఖమ్మం, మార్చి 11, ప్రభాతవార్త:** అవినీతి అంతం ,ప్రతి ఒక్కరి పంతం పేరిట వారం రోజులపాటు అవినీతి వారోత్సవాలు నిర్వహించారు, ప్రజల్ని చైతన్యపరిచి అవగాహన కల్పించారు, ప్రతినిత్యం ఏదో ఒక చోట చిన్న పెద్ద తార తమ్య భేదం లేకుండా పట్టుబడుతూనే ఉన్నారు, లంచం ఎంత చిన్నదైనా అందినవరకే చాలు అన్న తృప్తి చివరకు రూ 1500 కక్కుర్తి పడి రెడ్డి హ్యాండ్ గా పట్టుబడ్డాడు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి విచ్చలవిడిగా పేరుకు పోయింది, ఒకవైపు ప్రభుత్వం జీతం తీసుకుంటూ మరోవైపు చిన్నాచితక పనికి కూడా చేయి చాపుతున్నారు, ఖమ్మం నగరంలో ని జిల్లా ఎక్సైజ్ శాఖ సూపర్నెంట్ కార్యాలయంలో మంగళవారం ఏసీపి అధికారులు రెక్కీ నిర్వహించారు, ఈ కార్యాలయంలో సీనియర్ స యకుడుగా విధులు నిర్వహిస్తున్న భూక్య సోమ్లా లైసెన్స్ జిరాక్స్ కాపీ ఇవ్వడానికి చేయి చాపాడు, ఖమ్మం అవినీతి నిరోధక శాఖ ఏసీపి వై రమేష్ సమక్షంలో సదరు వ్యక్తి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు, దీంతో ఏసీపి చిక్కిన అతడ్ని అదుపులో తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## సిలబస్ మార్పు, ఆన్‌లైన్ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి సమావేశం

### ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాలతో సమావేశం

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాలతో తెలంగాణ ఉన్నత విద్యా మండలి మంగళవారం సమావేశం నిర్వహించింది. డిగ్రీ కోర్సుల ప్రవేశాల వ్యవస్థ(దోస్త్) సిలబస్ పునర్వ్యవస్థీకరణపై మెదటిసారి సమావేశానికి హాజరైన యాజామాన్యాలకు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ పీజీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. పరమేశ్వర్, జనరల్ సెక్రటరీ రామకృష్ణ, నరసింహ యాదవ్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా సిలబస్ నవీకరణ, మార్పులతోపాటు ఆన్‌లైన్ అడ్మిషన్ వ్యవస్థపై పునఃసమీక్ష, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలు, సెమిస్టర్ సిస్టమ్, డిటెన్షన్ విధానంపై చర్చించారు. సిలబస్ పునఃసమీక్షపై ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ మరింత ప్రాక్టికల్‌ఓరియెంటెడ్‌గా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు డిజిటల్ రూపంలో కూడా అధ్యయన సామగ్రిని పొందగలుగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సిలబస్‌ను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రూపకల్పన చేసి, విద్యార్థులు ఉద్యోగ సిద్ధత సాధించేందుకు ఉపకరించేదిగా రూపొందించనున్నట్లు తెలిపారు.

## నేడు పిఇ సెట్ నోటిఫికేషన్

### 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ, మే 24 తుది గడువు

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** తెలంగాణ తెలంగాణ రాష్ట్రంలోని బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ సెట్(పీఈసెట్)-2025కి సంబంధించిన నోటిఫికేషన్ నేడు (బుధవారం మార్చి 12)న జారీ చేయనున్నారు. దరఖాస్తులను ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. పీఈసెట్-2025ను పాలమూరు యూనివర్సిటీ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నేడు నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నట్టు పీఈసెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఈసెట్ దరఖాస్తులను ఈ నెల 15 నుంచి మే 24 వరకు స్వీకరించనున్నారు.


**నేడు పిజి ఇసెట్-2025 నోటిఫికేషన్ జారీ**

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో.. ఇంజనీరింగ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పిజి ఈసెట్-2025కి సంబంధించిన నోటిఫికేషన్ నేడు(బుధవారం మార్చి 12) జారీ చేయనున్నారు. దరఖాస్తులను ఈ నెల 17 నుంచి స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను నేడు జారీ చేయనున్నట్టు పిజి ఈ సెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ అరుణ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## పాతబస్తీలో గంజాయి సరఫరాకు యత్నించిన ముగ్గురి అరెస్ట్

### 30 కేజీల 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

**హైదరాబాద్ (చార్మినార్), మార్చి 11, ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ ముర్గీచౌక్‌లో గుట్టు చప్పుడు కాకుండ గంజాయి విక్రయించటానికి ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను సౌత్ ఈస్ట్ టాస్క్‌పోర్సు పోలీసులు,హుస్సేనీఆలం పోలీసులు కలిసి పట్టుకున్నారు.నింధితులు వద్ద నుంచి 30 కేజీల 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తర్ ప్రదేశ్‌లోని కాశీపుర ప్రాంతానికి చెందిన మహ్మద్ యాసిన్ అలియాస్ మహ్మద్ అహ్మద్ (42)పాతబస్తీ ముర్గీ చౌక్‌లో నివాసం ఉంటున్నాడు. బార్బర్ పని చేస్తున్న మహ్మద్ యాసిన్ సునాయాసంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గంజాయి సరఫరా చేస్తున్నాడు. గతంలో గంజాయి సరఫరా చేసిన కేసులో విశాఖ పట్టణంలో జైలుకు వెళ్లి వచ్చాడు.ముర్గీచౌక్‌లో హెయిర్ సెలూన్ షాపును మహ్మద్ యాసిన్ నడుపుతున్నప్పటికి మార్పు రాలేదు.కొద్ది రోజుల క్రితం ఒరిస్సాలోని పుకాలి మండలం,రాయఘడ గ్రామానికి చెందిన గంజాయి సప్లయిర్ విక్కీ వద్ద 30 కేజీల 70 గ్రాముల గం జాయిని మహ్మద్ యాసిన్ కొనుగోలు చేశాడు.ఖరీదు చేసిన గంజాయిని మహ్మద్ అలియాస్ ధూల్‌పేట్‌లోని కిషన్‌కు అందజేయ వలసి ఉంది. ఈనెల 8న మహ్మద్ యాసిన్,ఒరిస్సాలోని కోరాపుట్‌కు చెందిన గోపాల్ కారా (19).ఉత్తమ్ తామెల్‌తో కలిసి సంచులలో రైలు ద్వారా గంజాయిని తీసుకువచ్చారు. ముర్గీ చౌక్ లోని మహ్మద్ యాసిన్ ఇంట్లో గంజా యిని దాచారు. ధూల్‌పేట్‌కు చెందిన కిషన్‌కు గంజాయి చేరవలసి ఉంది. కాగా సౌత్ ఈస్ట్ టాస్క్ పోర్సు సిఐ ఎస్.సైదా బాబు, హుస్సేనీఆలం సిఐ ఎస్.సురేందర్, టాస్క్ పోర్సు ఎస్ఐలు సి.పాయిరాం, ఎం.మధు, ఎస్‌కె. కవియుద్దీన్, హుస్సేనీ ఆలం ఎస్ఐ నవీన్‌లు కలిసి ముర్గీచౌక్‌లోని మహ్మద్ యాసిన్ ఇంటిపై దాడి జరిపి 11 లక్షల 30 వేల రూపాయల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ యాసిన్,గోపాల్ ఖారా,ఉత్తమ్ తామెల్‌ను పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

## ఛాంపియన్స్ ట్రోఫీ..

# టీం ఆఫ్ ది టోర్నీ కెప్టెన్‌గా మిచెల్




### టీమిండియాలో కోహ్లితో సహా 6గురికి అవకాశం

### నో ఛాన్స్ అంటూ రోహిత్‌కు ఐసిసి బిగ్ షాక్

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ముగిసింది. టీం ఇండియా 12 సంవత్సరాల తర్వాత మరోసారి ఈ ట్రోఫీని గెలుచుకుంది. ఈసారి రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత జట్టు టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్లో కెప్టెన్ రోహిత్ అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయానికి స్టార్‌గా నిలిచాడు. ఈ విజయంపట్ల దేశం మొత్తం రోహిత్, టీం ఇండియాను అభినందిస్తున్న తరుణంలో, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) ఒక షాకింగ్ నిర్ణయం తీసుకుంది. టోర్నమెంట్ ముగిసిన తర్వాత తాజాగా ఐసిసి టోర్నమెంట్ ఉత్తమ జట్టును ప్రకటించింది. కానీ, ఛాంపియన్ కెప్టెన్ రోహిత్ అందులో చోటు దక్కించుకోలేదు. ఐసిసి మిచెల్ సాంట్నర్‌ను ఈజట్టుకు కెప్టెన్‌గా నియమించింది. న్యూజిలాండ్ కెప్టెన్ సాంట్నర్ తన జట్టును అద్భుతంగా నడిపించడమే కాకుండా టోర్నమెంట్‌లో 9 వికెట్లు పడగొట్టాడు. ఇక టీమిండియా నుంచి 6గురు ఆటగాళ్లకు ఇందులో స్థానం లభించింది. టాప్‌మిడిల్ ఆర్డర్‌లో, టీమిండియా ఆత్మలుగా పేరుగాంచిన విరాట్ కోహ్లి, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ ఎంపికయ్యారు. అదే సమయంలో, బౌలింగ్‌లో అద్భుతాలుచేసిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, పేసర్ మహ్మద్ షమీ కూడా చోటు దక్కించుకున్నారు. కాగా, అక్షర్ పటేల్ 12వ ఆటగాడిగా ఎంపికయ్యాడు. రోహిత్‌కు ఎందుకు స్థానం దక్కలేదనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఈనెల 9 ఆదివారం దుబాయ్‌లో జరిగిన ఫైనల్‌లో టీమిండియా న్యూజిలాండ్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించి టైటిల్‌ను గెలుచుకుంది. ఫైనల్లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ 76 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. దాని ఆధారంగా టీం ఇండియా 252 పరుగుల లక్ష్యాన్ని సాధించి వరుసగా రెండో టైటిల్‌ను గెలుచుకుంది. ఈ ఇన్నింగ్స్‌కు రోహిత్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా కూడా ఎంపికయ్యాడు. అయితే ఐసిసి టోర్నమెంట్ జట్టును ఎంపిక చేసినప్పుడు, రోహిత్‌ను కెప్టెన్‌గా చేయలేదు. కానీ, 12 మంది ఆటగాళ్లలో చేర్చలేదు.

వాస్తవానికి ఫైనల్‌కు ముందు ఈ టోర్నమెంట్‌లో భారత కెప్టెన్ బ్యాట్ ఎక్కువ పరుగులు చేయకపోవడంతో రోహిత్‌కు స్థానం లభించలేదనేది ఐసిసి వర్గాలు చెబుతున్నాయి. మొత్తం టోర్నమెంట్‌లో రోహిత్ 5 ఇన్నింగ్స్‌లో 180పరుగులు మాత్రమే చేశాడు. ఇటువంటి పరిస్థితిలో, ఓపెనర్‌గా జట్టులో అతనిస్థానాన్ని కనుగొనడం కష్టం. టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు సాధించిన రచిన్ రవీంద్ర, ఆఫ్ఘనిస్తాన్ ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్‌లను ఓపెనర్లుగా ఎంపికచేశారు. ఇటువంటి పరిస్థితిలో, రోహిత్‌కు చోటు దక్కలేదు. ఐసిసి ప్రకటించిన ఛాంపియన్స్ ట్రోఫీ టీం ఆఫ్ ది టోర్నమెంట్‌లో మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), రచిన్ రవీంద్ర, ఇబ్రహీం జాద్రాన్, విరాట్ కోహ్లి, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మాట్ హెన్రీ, మహమ్మద్ షమీ, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ ఉన్నారు.




## ఏసియన్ లెజెండ్స్ లీగ్‌లో..

# ఏసియన్ స్టార్స్ గెలుపు

### 6 వికెట్ల తేడాతో అఫ్ఘానిస్థాన్ పఠాన్స్ చిత్తు

**న్యూఢిల్లీ:** ఏసియన్ లెజెండ్స్ లీగ్-2025 తొలి ఎడిషన్ ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నీలో మొత్తం ఐదు జట్లు ఏసియన్ లయన్స్, శ్రీలంక లయన్స్, అఫ్ఘానిస్థాన్ పఠాన్స్, ఇండియన్ రాయల్స్, బంగ్లాదేశ్ టైగర్స్ పాల్గొంటున్నాయి. ఇండియన్ రాయల్స్ తరఫున టీమిండియా స్టార్లు శిఖర్ ధవన్, ఇర్ఫాన్ పఠాన్, యూసఫ్ పఠాన్, అంబటి రాయుడు, మనోజ్ తివారి, మునాఫ్ పటేల్ తదితర స్టార్లు ఆడుతున్నారు. ఇక ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో ఏసియన్ స్టార్స్, అఫ్ఘానిస్థాన్ పఠాన్స్ జట్లు తలపడ్డాయి. రసవత్తరంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఏసియన్ స్టార్స్ జట్టు 6 వికెట్ల తేడాతో అఫ్ఘానిస్థాన్ పఠాన్స్ జట్టును ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘానిస్థాన్ షోయబ్ ఖాన్ (63 బంతుల్లో 104 నాటౌట్) మెరుపు శతకంతో కదం తొక్కడంతో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీస్కోర్ చేసింది. అఫ్ఘానిస్థాన్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అస్గర్ అఫ్ఘాన్ (65) అర్ధ సెంచరీతో రాణించాడు. అనంతరం బరిలోకి దిగిన ఏషియన్ స్టార్స్ కెప్టెన్ మెహ్రాన్ ఖాన్ (52 బంతుల్లో 109 నాటౌట్) సునామీ శతకంతో విరుచుకుపడటంతో 19.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. మరో ఎండ్‌లో మెహ్రాన్ ఖాన్‌కు పెద్దగా సపోర్ట్ లేనప్పటికీ ఒంటిచేత్తో ఏషియన్ స్టార్స్ జట్టును గెలిపించాడు. ఏసియన్స్ స్టార్స్ ఇన్నింగ్స్‌లో అంకిత్ నర్వాల్ (39), రాఘవ్ ధావన్ (34 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. ఇక మరో మ్యాచ్ జరగాల్సి ఉండగా అది రద్దైంది. ఈ రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టైగర్స్, ఇండియన్ రాయల్స్ జట్లు తలపడాల్సి ఉండింది. ఇక ఏసియన్ లెజెండ్స్ లీగ్‌లో ఇండియన్ రాయల్స్ జట్టులో అంబటి రాయుడు, మనోజ్ తివారి, సుబ్రమణ్యం బద్రీనాథ్, ఫయాజ్ ఫజల్, శిఖర్ ధవన్, యూసఫ్ పఠాన్, ఇర్ఫాన్ పఠాన్, నమన్ ఓఝా, శ్రీవట్స్ గోస్వామి, అనురీత్ సింగ్, ము నాఫ్, కరణ్‌వీర్ సింగ్, బరిందర్ శ్రాన్, షాదాబ్ జకాతి, మన్‌ప్రీత్ గోని, సుదీప్ త్యాగి ఉన్నారు.

## మహిళల ప్రీమియర్ లీగ్‌లో..

# ఫైనల్ రేస్‌లో ముంబై



**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అగ్రస్థానంతో నేరుగా ఫైనల్ చేరేందుకు ముంబై ఇండియన్స్ జట్టు విజయం దూరంలో నిలిచింది. గెజరాత్ జెయింట్స్‌పై జరిగిన ఉత్కంఠ పోరులో ముంబై 9 పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 179 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ (33 బంతుల్లో 54; 9 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించింది. తర్వాత గుజరాత్ 20 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌ టైంది. భారతి (25 బంతుల్లో 61; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) ముంబై బౌలర్లపై విరుచుకు పడింది. ఒకదశలో జెయింట్స్ 92 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఓటమికి సిద్ధమవగా, భారతి ధనాధన్ ఆటతో ఆశలు రేపింది. 41 బంతుల్లో 88 పరుగుల సమీకరణం ఆఖరి ఓవర్‌కు వచ్చేసరికి 6 బంతుల్లో 13 పరుగులుగా మారింది. కానీ 20వ ఓవర్ వేసిన హేలీ, తనూజ (10)ను రనౌట్ చేసింది. తర్వాతి బంతికి సిమ్రాన్ (18; 1 ఫోర్,1 సిక్స్), చివరి బంతికి ప్రియా (1) వికెట్లు తీసి ఆలౌట్‌చేసింది. ప్రస్తుతం ముంబై, ఢిల్లీక్యాపిటల్స్ 10 పాయింట్లతో సంయు క్తంగా అగ్రస్థానంలో ఉన్నా, మెరుగైన రన్‌రేట్ కారణంగా ఢిల్లీ టాప్‌లో ఉంది.

## ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో..

# శ్రీలంక ఘన విజయం

### ఇంగ్లండ్‌పై 9 వికెట్ల తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్-2025లో శ్రీలంక జోరు కొనసాగుతుంది. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా పాయింట్ల పట్టికలో భారత్‌ను వెనక్కు నెట్టి అగ్ర స్థానానికి చేరుకోవడంతో పాటు, నాకౌట్‌కు అర్హత సాధించింది. నాలుగు మ్యాచ్‌లుఆడినా ఒక్క విజయంకూడా సాధించని ఇంగ్లండ్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న శ్రీలంక, ఇంగ్లండ్‌ను స్వల్ప స్కోర్‌కే కట్టడి చేసింది. శ్రీలంక బౌలర్లు కలిసికట్టుగా రాణించడంతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 146 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఉడాన, దిలువన్ పెరీరా, గుణరత్నే, చతురంగ, జీవన్ మెండిస్ తలో వికెట్ తీయడంతో పాటు, పొదుపుగా బౌలింగ్‌చేశారు. ఇంగ్లండ్ బ్యాటర్లలో ఫిల్ మస్టర్డ్ (39 బంతుల్లో 50, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీతో రాణించగా, కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ (10), టీమ్ ఆంబ్రోస్ (17), డారెన్ మ్యాడీ (15), టిమ్ బ్రేస్నన్ (18 నాటౌట్), క్రిస్ ట్రెమ్లె ట్రెమ్లెట్ (14 నాటౌట్) రెండంకెల స్కోర్లు చేయగలిగారు. ఉడాన బంతితో సత్తా చాటడంతో పాటు, ఫీల్డింగ్‌లోనూ మెరిశాడు. ఈ మ్యాచ్‌లో అతను మూడు క్యాచ్‌లు పట్టాడు. స్వల్ప లక్ష్య ఛేదనలో శ్రీలంక ఓపెనర్ కుమార సంగక్కర విధ్వంసకర శతకంతో విరుచుకు పడ్డాడు. సంగ 47బంతుల్లో 19 ఫోర్లు, సిక్సర్ సాయంతో 106 పరుగులతో అజేయంగా నిలిచి తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. లంక ఇన్నింగ్స్‌లో రొమేశ్ కలువితరణ 16, అసేల గుణరత్నే 22 పరుగులతో అజేయంగా నిలిచాడు. సంగక్కర సుడిగాలి శతకంతో చెలరేగడంతో శ్రీలంక 12.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది (వికెట్ కోల్పోయి). శ్రీలంక కోల్పోయిన ఏకైక వికెట్ (కలువితరణ) మాస్కరెన్హాస్‌కు దక్కింది.

## ఇండియన్ ప్రొ బాక్సింగ్ లీగ్‌లో..

# రఫాడించిన భారత్ బాక్సర్లు



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రొబాక్సింగ్ లీగ్ (ఐపిబిఎల్)-2025లో భాగంగా వరల్డ్ ఛాంపియన్స్‌తో జరిగిన పోటీలో భారత్ బాక్సర్లు అదరగొట్టి రఫాడించారు. రానా దగ్గుబాటి బాక్సింగ్ బే-ఆంటొని పెట్టిస్ ఎపిఎఫ్‌సిల మధ్య జరుగుతున్న బాక్సింగ్ పోటీల్లో అక్షయ్ చహల్-సబరి జయశంకర్ సత్తా చాటారు. ప్రపంచ చాంపియన్లు అయిన లూయిస్ ఫెలిషియానో, సెర్గియో పెట్టిస్‌లపై అద్భుత విజయం సాధించి, ప్రొఫెషనల్ బాక్సింగ్‌కు భారత్ సిద్ధంగా ఉందనే సంకేతాలు ఇచ్చారు. అక్షయ్-సబరి వీరోచిత పోరాటం కారణంగా టీమిండియా-టీమ్ అమెరికా మధ్య సాగిన పోరు 2-2తో డ్రాగా ముగిసింది. ఈ సందర్భంగా మాజీ యూఎఫ్సీ లైట్ వెయిట్ ఛాంపియన్ ఆంటోని పెట్టిస్ మాట్లాడుతూ ఇండియన్ ప్రొ బాక్సింగ్ లీగ్ ప్రపంచంలోని అతి పెద్ద బాక్సింగ్ లీగ్‌లలో ఒకటిగా ఎదుగుతోందన్నారు. అగ్రశ్రేణి బాక్సర్లను ఇక్కడికి తీసుకువచ్చేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలియచేశాడు. ఇండియాలో ఈ పోటీలను మరింత విస్తృతం చేయాలనే సంకల్పంతో ఉన్నామని వెల్లడించాడు.

# యుపిఐ, రూపే లావాదేవీలపై ఇక ఛార్జీలు!

**న్యూఢిల్లీ, మార్చి 11:** ఈ మధ్య ఎక్కడచూసినా ఆన్‌లైన్ చెల్లింపులే! టీ తాగి రూ.10 చెల్లించాలన్నా యుపిఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రస్తుతం ఇలాంటి యుపిఐ, రూపే డెబిట్ కార్డులతో చేసే లావాదేవీలపై వ్యాపారులపై ఎలాంటి ఛార్జీల భారం లేదు. అయితే త్వరలోనే ఈ లావాదేవీలపైనా మర్చెంట్ ఛార్జీలను విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలిసింది. రానున్న రోజుల్లో పెద్ద వ్యాపారులు యుపిఐ ఆధారిత చెల్లింపులకు ఛార్జీలు చెల్లించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందని కొన్ని కథనాలు వెలువడ్డాయి. వార్షిక ఆదాయం రూ.40 లక్షలపైన ఉండే వ్యాపారులకు యుపిఐ చెల్లింపులపై మర్చెంట్ డిస్కౌంట్ రేట్‌ను తిరిగి తీసుకురావాలని ప్రతిపాదిస్తూ బ్యాంకింగ్ ఇండస్ట్రీ ప్రతినిధులు ఇటీవల కేంద్రానికి అధికారిక ప్రతిపాదన పంపారు. దీనిపైకేంద్రం సానుకూలంగా స్పందించిందని ఓ బ్యాంకర్ వెల్లడించినట్లు తెలిసింది. వీసా, మాస్టర్ కార్డ్ వంటి డెబిట్‌కార్డులు, ఇతర క్రెడిట్ కార్డులతో చేసే చెల్లింపులకు పెద్ద వ్యాపారులు ఎండిఆర్ ఛార్జీలు చెల్లిస్తున్నారు. అలాంటప్పుడు వారు యుపిఐ, రూపే డెబిట్‌కార్డు ఆధారిత లావాదేవీలకు ఎందుకు ఛార్జీలు కట్టకూడదు? అని సదరు బ్యాంకర్ ప్రశ్నించారు. కేంద్రం కూడా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. అయితే 'టైర్డ్ ఫ్రెజింగ్ సిస్టమ్' ఆధారంగా ఈ లావాదేవీలపై ఛార్జీలు విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలిసింది. అంటే రూ.40 లక్షల్లోపు వార్షికాదాయం ఉండే వ్యాపారులు యుపిఐ చెల్లింపులను ఉచితంగానే స్వీకరించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఛార్జీలను తిరిగి తీసుకు రావడం వల్ల యూజర్లపై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండబోదని తెలుస్తోంది. ఎందుకంటే ఈలావాదేవీల కోసం యూజర్ల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరు. కాకపోతే దీనివల్ల వ్యాపారులు మళ్లీ నగదు చలామణికి మొగ్గుచూపే అవకాశాలున్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మూడేళ్ల ముందు వరకు యుపిఐ ఆధారిత చెల్లింపులకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. ఆయా ఆవాదేవీలను ప్రాసెస్ చేసేందుకు ఈ రుసుము చెల్లించేవారు. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే యుపిఐ చెల్లింపులపై ఈ ఎండిఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది. అయితే ఈ యేడాది బడ్జెట్‌లో ఈ సబ్సిడీని రూ.3500 కోట్ల నుంచి రూ.437 కోట్లకు తగ్గించారు.




# 21 నెలల కనిష్టానికి డీమ్యాట్ ఖాతాలు!

**ముంబై, మార్చి 11:** దేశంలో కొత్త డీమ్యాట్ ఖాతాల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఒకప్పుడు డీమ్యాట్ ఖాతాలు తెరవడంలో సరికొత్త మైలురాళ్లు నమోదయ్యేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. స్టాక్ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో కొత్తగా మార్కెట్ వైపు చూసేవారి సంఖ్య తగ్గింది. దాదాపు రెండేళ్ల కనిష్టానికి చేరిందంటే మార్కెట్ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో ఫిబ్రవరిలో కొత్తగా కేవలం 22.6లక్షల డీమ్యాట్ ఖాతాలు మాత్రమే తెరుచుకున్నాయి. 2023 మే తర్వాత ఇదే అత్యల్పం. గతేడాది సెప్టెంబరు నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొంటున్నాయి. దీంతో నెలవారీ నమోదయ్యే కొత్త డీమ్యాట్ ఖాతాల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గతేడాది డిసెంబరులో 32.6లక్షల కొత్త ఖాతాలు యాడ్ అవ్వగా, జనవరి నాటికి ఆ సంఖ్య 28.3 లక్షలకు పడిపోయింది. ఫిబ్రవరిలోఅయితే 22.6 లక్షలకు పరిమితమైంది. ఫిబ్రవరి ముగిసే సరికి ఎన్ఎస్‌డిఎల్‌లో నమోదైన డీమ్యాట్ ఖాతాల సంఖ్య 19.04కోట్లు ఉంటే, సిడిఎస్ఎస్ వద్ద నమోదైన డీమ్యాట్‌ఖాతాల సంఖ్య 18.81 కోట్లుగాఉంది. గతేడాది సెప్టెంబరు చివరిలో నమోదైన గరిష్టస్థాయిల నుంచి సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు 14శాతం క్షీణించాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఏకంగా 23శాతం పడిపోయాయి. ఈక్విటీ మార్కెట్లు క్రమంగా నష్టాల్లోకి జారుకోవడంతో దలాల్ స్ట్రీట్‌లో నేరుగా పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్ల ఆసక్తితగ్గింది. ఐపిఒలరాక కూడా తగ్గింది. ఈ కారణంగా కొత్తగా ఖాతాలు తెరిచే వారి సంఖ్య తగ్గుముఖం పట్టేందుకు మరో కారణమని నిపుణులు చెబుతున్నారు. డెరివేటివ్స్ మార్కెట్లలో తగ్గిన కార్యకలాపాలు కూడా కొత్త డీమ్యాట్ ఖాతాలు తగ్గుముఖం పట్టేందుకు ఓ కారణమని మార్కెట్ల నిపుణులు పేర్కొంటున్నారు. డెరవేటివ్స్ మార్కెట్లలో తగ్గి కార్యకలాపాలు కూడా కొత్త డీమ్యాట్‌ఖాతాలు తగ్గుముఖంపట్టేందుకు ఓ కారణమని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. డెరివేటివ్స్ విభాగంలో రోజు వారీ సగటు టర్నోవర్ 46శాతం క్షీణించింది. 2024 సెప్టెంబరులో రూ.537.26లక్షల కోట్లుగా ఉన్న ఈ టర్నోవర్ ఈ యేడాది ఫిబ్రవరి నాటికి రూ.287.59 లక్షల కోట్లకు పడిపోయింది.




# ఆపిల్‌కు రూ.15 లక్షల కోట్ల నష్టం

**వాషింగ్టన్, మార్చి 11:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేపడుతున్న చర్యలతో అక్కడి స్టాక్ మార్కెట్లు కుదేలవుతున్నాయి. అమెరికా ప్రధాన సూచి నాస్‌డాక్ ఏకంగా 4శాతం నష్టపోయింది. టెక్ సంస్థల షేర్లు కూడా భారీగా క్షీణించాయి. ప్రముఖ టెక్ దిగ్గజం ఆపిల్ అయితే కేవలం ఒక్క రోజులోనే ఏకంగా 174 బిలియన్ డాలర్లు అంటే రూ.15లక్షల కోట్లు నష్టాన్ని మూటగట్టుకుంది. ఆపిల్, మైక్రోసాఫ్ట్, టెస్లా, ఎన్విడియా, గూగుల్ పేరెంట్ కంపెనీ అయిన ఆల్ఫాబెట్, అమెజాన్, మెటా అమెరికాలో అతిపెద్ద టెక్ దిగ్గజ సంస్థలు. ఈ ఏడు అతిపెద్ద అమెరికా టెక్‌కంపెనీలు మార్కెట్లో ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. మార్కెట్ ఒడుదు దుకుల నేపథ్యంలో ఈ అన్ని కంపెనీల షేర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. సోమవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో మార్కెట్ విలువలో ఏకంగా 750 బిలియన్ డాలర్లు కోల్పోయాయి. సుంకాల ఆందోళన నేపథ్యంలో నాస్‌డాక్ భారీగా క్షీణించింది. 2022 తర్వాత అత్యంత భారీ పతనాన్ని చవిచూసింది. ఆపిల్ తర్వాత అత్యధికంగా మార్కెట్ విలువను కోల్పోయిన స్థానంలో ఎఐ చిప్‌మేకర్ ఎన్విడియా ఉంది. కేవలం కంపెనీ షేర్లు 5శాతం క్షీణించి మార్కెట్ విలువలో 140 బిలియన్ డాలర్లు కోల్పోయింది. జనవరిలో కొత్త గరిష్టాన్ని నమోదు చేసిన సంస్థ కేవలం రెండు నెలల్లోనే మూడో వంతు క్షీణించింది. టెస్లా షేర్లు కూడా నష్టాల్లోకి జారుకున్నాయి. డిసెంబరు నుంచి ఇప్పటి వరకు కంపెనీ తన విలువలో సగానికిపైగా కోల్పోయింది. మైక్రోసాఫ్ట్ 98 బిలియన్ డాలర్లు, గూగుల్ 95 బిలియన్ డాలర్లు, అమెజాన్ 50 బిలియణ్ డాలర్లు, మెటా 70 బిలియన్ డాలర్ల మేర తమ మార్కెట్ విలువను కోల్పోయాయి.



# సెన్సెక్స్, నిఫ్టీలను వీడని నష్టాలు

**ముంబై, మార్చి 11:** దేశీయ స్టాక్ మార్కెట్‌సూచీలు మంగళవారం ఫ్లాట్‌గా ముగిసాయి. అమెరికాలో నెలకొన్న మాంద్యం భయాలతో సోమవారం ఆ దేశ స్టాక్ మార్కెట్లు కుదేలవ్వగా, మంగళవారం ఆసియా స్టాక్ మార్కెట్లపైనా ప్రతికూల ప్రభావం పడింది. దేశీయ మార్కెట్లపైనా ఆరంభంలో ఆ ప్రభావం కనిపించినప్పటికీ, తర్వాత సూచీలు క్రమంగా కోలుకున్నాయి. చివరికి 12.85 పాయింట్లు నష్టపోయి 74,102.32 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ముగిశాయి. నిఫ్టీ కూడా 37.60 పాయింట్లు నష్టపోయి 22,497.90 పాయింట్ల వద్ద నిలిచింది. ఇండస్ ఇండ్ బ్యాంకు, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, జొమాటో వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. సన్‌ఫార్మా, ఐసిఐసిఐ బ్యాంకు, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మారుతి సుజుకి వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 69 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2916 డాలర్ల వద్ద ట్రేడయింది.




# వాణిజ్యం

# రూ.349 లక్షల కోట్ల సంపద ఆవిరి

**వాషింగ్టన్, మార్చి 11:** అమెరికా స్టాక్ మార్కెట్లు దాదాపు 20 రోజుల వ్యవధిలోనే భారీగా పతనం అయ్యాయి. స్టాక్స్‌లోని ఇన్వెస్టర్ల సంపద 4 లక్షల కోట్ల డాలర్లు అంటే రూ.349 లక్షల కోట్ల మేరకు ఆవిరైపోయింది. ఇది యూకే, ఫ్రాన్స్ వంటి దేశాల జిడిపి కంటే ఎక్కువ కావడం విశేషం. ముఖ్యంగా అమెరికా ఫెడల్ గవర్నమెంట్ షట్‌డౌన్ భయాలు సూచీలను వెంటాడుతున్నాయి. దీనికి ట్రంప్ అస్థిర విధానాలు తోడయ్యాయి. ఎస్అండ్‌పి 500 సూచి ఫిబ్రవరి 19వ తేదీన నమోదు చేసిన ఆల్‌టైమ్ హై నుంచి ఇప్పటికి 8 శాతానికిపైగా విలువ కోల్పోయింది. నాస్‌డాక్ కాంపోజిట్ డిసెంబర్‌లో నమోదు చేసిన అత్యధిక విలువ నుంచి 10 శాతం పతనమైంది. ఇక ఒక్క సోమవారమే 1.7 లక్షల కోట్ల డాలర్ల సంపద కరిగిపోయింది. 2022 సెప్టెంబర్ తర్వాత ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఇక మస్క్ నేతృత్వంలోని టెస్లా షేర్ ధర 15శాతం పతనం కావడం విశేషం. డిసెంబరు 17 నుంచి ఈ సంస్థ షేరు విలువ 50శాతం ఆవిరైంది. నాడు అత్యధికంగా 479.86 డాలర్లు ఉండగా, సోమవారం అది 222.15 డాలర్లకు చేరింది. వివిధ కారణాలు కలిసి ఓ ప్యాకేజీలా మార్కెట్లను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా వాణిజ్య విధానాల్లో హఠాత్తుగా వస్తున్న మార్పులు, ఆర్థిక మాంద్యం భయాలు, స్టాక్స్ అధిక విలువలు వంటివి కారణమవుతున్నాయని లాజర్డ్ సిఇఒ పీటర్ ఓర్స్‌జాగ్ వెల్లడించారు. అమెరికాలోని భారీ సంపన్నులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటోంది. అక్కడి మార్కెట్లలో 50శాతం విలువైన సంపద ఒకశాతం మంది వద్ద ఉంటుంది. ఇక 37 శాతం విలువైన సంపద 10శాతం మంది వద్ద ఉంటుంది. 12శాతం వాటా 40 శాతం మంది వద్ద కేంద్రీకృతమైంది. మిగిలిన ఒకశాతం వాటా 50శాతం మందిప్రజల చేతిలో ఉందని ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు ఆఫ్ సెయింట్ లూయిస్ డేటాపేర్కొంది.



# ఇండస్ ఇండ్ బ్యాంకు షేర్లు 20% డౌన్

**ముంబై, మార్చి 11:** ప్రముఖ ప్రైవేట్‌రంగ బ్యాంకు ఇండస్ ఇండ్ బ్యాంకు షేర్లు భారీగా కుంగాయి. మంగళవారం ట్రేడింగ్ సెషన్‌లో ఏకంగా 20శాతం మేర క్షీణించాయి. బ్యాంకుకు చెందిన డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. తమ డెలివేటివ్ పోర్ట్‌ఫోలియోల అవకతవకల్ని గుర్తించినట్లు ఇండస్ ఇండ్ బ్యాంకు అంతర్గత సమీక్షలో వెల్లడించింది. దీంతో బ్యాంకు నికర విలువపై దాదాపు 2.35 శాతం ప్రతికూల ప్రభావం పడనున్నట్లు బ్యాంకు అంచనా వేసింది. అంటే ఏకంగా రూ.1.530 కోట్ల నష్టానికి సమానం. ఈ ప్రకటన షేర్లపై ఒత్తిడి పెంచింది. దీంతో షేర్లు 20శాతం మేర కుంగాయి. బ్యాంకు మార్కెట్ విలువ ఏకంగా రూ.14వేల కోట్లు క్షీణించింది. గతేడాది డిసెంబరు నాటికి బ్యాంకు నికర విలువ రూ.65,102 కోట్లుగా ఉంది. ఇండస్ ఇండ్ బ్యాంకు షేర్లు సోమవారం ట్రేడింగ్ సెషన్‌లోనూ కుంగాయి. ప్రస్తుత సీఇఒ సుమంత్ కత్పలియా పదవీకాలాన్ని మూడేళ్లు కాకుండా, ఒక సంవత్సరం పాటే పొడిగించేందుకు ఆర్‌బిఐ అనుమతించింది. ఈ ప్రకటనతో షేర్లు సోమవారం బిఎస్ఇలో 3.86 శాతం నష్టంతో రూ.900.70 వద్ద ముగిశాయి. గత సంవత్సరంలో బ్యాంకు షేర్లు 42.42 శాతం క్షీణించాయి. గత ఆరు నెలల్లోనే 37.24 శాతం కుంగాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.